# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 158 | హైదరాబాద్ | శుక్రవారం 12-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

స్థానిక భక్తులకు ఈ-డిప్ విధానంలో వైకుంఠ ద్వార దర్శనం... టీటీడీ ప్రకటన



11లో

## హైదరాబాద్‌లో ఒకేచోట నాలుగు కార్లు దగ్ధం

- రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో దగ్ధమైన కార్లు
- ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయిన కారు, ట్రాలీ
- మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నం

## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

- మెస్సీ హైదరాబాద్ పర్యటన ప్రైవేట్ కార్యక్రమం అని రేవంత్ వెల్లడి
- ఈవెంట్‌కు హాజరు కావాలని రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం
- ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్



11లో

## నేటి భారతం

- మహా నగరాన్ని పరిశుభ్రం చేసే ప్రతి చేతి వెనుక..
- ఒక సాహసిక హృదయం ఉంటది..
- జీ.హెచ్.ఎం.సి. పారిశుధ్య కార్మికులు..
- మన జీవనాన్ని సురక్షితంగా..
- అందంగా మార్చే వీరోచిత శక్తులు.
- మన వీధులు శుభ్రంగా ఉంటేనే
- మన జీవితం ఆరోగ్యంగా ఉంటుంది..
- ఈ శుభ్రత వెనుక జీ.హెచ్.ఎం.సి. శానిటేషన్
- కార్మికుల అద్భుతమైన కష్టమే ఉంది.
- ప్రతి రోజూ చెత్తను తొలగిస్తున్నవారు..
- మన ఊళ్లు, వీధులు సుందరంగా నిలబడేలా
- చూసే అమోఘ ఫలితం సృష్టిస్తున్నారు..
- ఆ సేవకు మనం కృతజ్ఞత చూపించాలి..

– వి.జీ., సీనియర్ జర్నలిస్ట్..

## శీతాకాల విడిది కోసం.. హైదరాబాద్ వస్తున్న రాష్ట్రపతి ముర్ము

### సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



11లో




11లో

## ఇస్రో దూకుడు...

- డిసెంబర్ 15న అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం
- ఇస్రో అత్యంత శక్తిమంతమైన LVM3 రాకెట్‌తో ఈ ప్రయోగం
- బ్లూ బర్డ్-6 కమ్యూనికేషన్ శాటిలైట్ బరువు 6.5 టన్నులు
- భారత్-అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద అంతరిక్ష సహకారం

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్.. ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చ!

- ప్రధాని మోదీకి ఫోన్ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ
- వాణిజ్యం, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారంపై సమీక్ష
- త్వరలో భారత్‌లో పర్యటిస్తానని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్
- మోదీ గొప్ప నాయకుడని, తన స్నేహితుడని ప్రశంసలు



11లో



- రోజు రోజుకు దిగజారుతున్న జీ.హెచ్.ఎం.సి. పారిశుధ్య కార్మికుల పరిస్థితులు..
- వారి పరిరక్షణకు కనీస ఉపకరణాలు కూడా లేకపోవడం దురదృష్టం..

12లో

## పలు సవాళ్లతో కూడుకున్న కార్మికుల జీవితాలు..

కోడి కూతకు ముందే వాళ్ళు నిద్ర లేస్తారు.. చలిలోనూ, వర్షం లోనూ, వేడి గాల్పులలోనూ ఎలాంటి విసుగులేకుండా పనిలో పడతారు.. రాత్రంతా చెత్తతో నిండిపోయిన రోడ్లను శుభ్రంచేసే విధులు నిర్వహిస్తారు.. తెల్లారి మనం లేచి ప్రయాణం మొదలెట్టేసరికి నగర వీధులన్నీ ఎంతో పరిశుభ్రంగా కనిపిస్తాయి.. మన ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయి.. దీనికి కారణం జీ.హెచ్.ఎం.సి.లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు.. వారి సేవలను ఎంతచెప్పకున్నా తక్కువే అవుతాయి.. వారికి కాలంతో పనిలేదు.. అన్ని కాలాల్లో పనిచేయాల్సిందే.. పైగా ప్రభుత్వం వారికి సరైన సేఫ్టీ పరికరాలు కూడా అందజేయడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.. అలాగే వారు తరచుగా అనారోగ్యం పాలవుతుంటారు.. ఒక్కోసారి అనుకోని ప్రమాదాలు కూడా ఎదురవుతుంటాయి.. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో భుక్తికోసం వారు పనిచేయాల్సి ఉంటుంది.. వారికి ప్రభుత్వం తరఫున వారి కంపెనీకి ఎంత జీతం ఇస్తారో తెలియదు కానీ.. వారికి మాత్రం రూ. 13000 నుండి రూ. 15 వెలవరకు నెలకు జీతం ఇస్తారు.. ఈ జీతం నుంచి నెలకు వెయ్యి నుంచి రెండువేల రూపాయలు వారి ఎస్.ఎఫ్.ఏ.లకు లంచంగా చెల్లించాల్సిందే.. అలా చెల్లించని పక్షంలో ఏదో ఒక కారణం చెప్పి వారిని ఉద్యోగం లోంచి తీసేస్తారు.. విధిలేని పరిస్థితుల్లో కష్టమో.. నిష్టూరమో పనిచేతుంటారు.. ఇక ఈ కార్మికుల్లో అందమైన ఆడవాళ్లు ఉంటే అంతే సంగతులు వారు లైంగిక వేధింపులకు గురికావాల్సిందే.. ఇక ఈ ఎస్.ఎఫ్.ఏ.లు తమవారు ఎవరైనా ఉన్నారంటే వారు విధులకు హాజరు కాకపోయినా హాజరు పట్టీలో హాజరు వేసి నెల నెలా జీతాలు చెల్లిస్తారు.. అదే ఎవరైనా తమకు వ్యతిరేకంగా ఉంటే చాలు ఇక వారితో ఆడుకుంటారు.. అదే డబ్బులు ఇస్తే చాలు డ్యూటీకి రాకపోయినా హాజరు వేస్తారు.. ఇదిలా ఉంటే ఈ వ్యవహారాలపై ఎస్.ఎఫ్.ఏ. లను ప్రశ్నిస్తే " మేము పై అధికారులకు చెల్లించాలి.. అందుకే తప్పడం లేదు " అని సమాధానం చెబుతారు.. ఈ క్రమంలో జీ.హెచ్.ఎం.సి. యావత్తూ అవినీతిమయం అయిపోయిందని చెప్పవచ్చు..

## రేపు విశాఖలో సీఎం, మంత్రి పర్యటన

### కాగ్నిజెంట్, సత్వా క్యాంపస్‌లకు భూమి పూజ

- విశాఖలో కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ భారీ పెట్టుబడులు
- రేపు రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న సీఎం, మంత్రి లోకేశ్
- మరో 7 ఐటీ క్యాంపస్ లకు కూడా భూమిపూజ చేయనున్న లోకేశ్
- రూ.3000 కోట్లకు పైగా పెట్టుబడులు, 33 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు



11లో

భారత శక్తి

# రెంటికి చెడ్డ రేవడిలా మమత

పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేని నేతగా ఎదిగారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ. కమ్యూనిస్టుల కంచుకోటను 15 ఏళ్లక్రితం బద్దలు కొట్టి అధికారం చేపట్టారు. వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఇటీవలే జరిగినట్లు అనిపిస్తోంది. వెస్ట్? బెంగాల్? శాసన సభకు ఎన్నికలు జరిగి దాదాపు ఐదేండ్లు గడిచిపోయాయి. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్? శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 2026 పశ్చిమ బెంగాల్ స్టేట్? ఎన్నికలు హోరాహోరీగా చాలా పెద్ద పోరాటాన్ని తలపించే విగా ఉంటాయి.గొప్ప ఫ్రెంచ్ రచయిత జీన్ అల్ఫోన్స్ కర్ ఇలా అన్నారు.. ‘ కొన్ని విషయాలు ఎంతగా మారినా మరికొన్ని విషయాలు అంతకంటే ఎక్కువగా యథాతథంగా అలాగే ఉంటాయి’. ఇది వెస్ట్? బెంగాల్ రాజకీయాలకు పూర్తిగా వర్తిస్తుంది. 2000 నుంచి తృణమూల్? కాంగ్రెస్? అధినేత్రి మమతా బెనర్జీ, బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి, అదే కాంగ్రెస్ నాయకులు, అదే కమ్యూనిస్ట్ నాయకులు బెంగాల్ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తృ ణమూల్? కాంగ్రెస్? చీఫ్? మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమబెంగాల్? ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 1977 నుంచి ఏకధాటిగా పశ్చిమ బెంగాల్?ను పాలిస్తున్న వామపక్ష ప్రభుత్వాన్ని మమతా బెనర్జీ అనూహ్యంగా ఓడించారు. ఇది ఒక సూపర్? హ్యూమన్ ? టాస్క్?. తృణ మూల్? కాంగ్రెస్? అధినాయకురాలు మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీని కూడా వెస్ట్? బెంగాల్?లో పూర్తిగా నాశనం చేసింది. 2021లో జరిగిన పశ్చిమ బెంగాల్? రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గెలవకుండా మమతా బెనర్జీ అడ్డుకోగలిగారు. ఆమెకు ఎదురు నిలిచిన రాజకీయ శత్రువులు మొత్తం కనుమరుగై పోయారని మమతా బెనర్జీ భావిస్తున్న తరుణంలో.. అకస్మాత్తుగా వెస్ట్? బెంగాల్?లో బీజేపీ ఒక బలమైన రాజకీయ శక్తిగా మారింది. ఇప్పుడు బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. . అయితే ప్రతీ ఎన్నికల్లో మమతాబెనర్జీ పార్టీకి బెంగాల్‌లోని ముస్లింలు అండగా నిలిచారు. దీంతో మమతా కూడా సహజంగానే ఇంతకాలం వారికి అనుకూలంగా వ్యవహరించారు. అయితే ముస్లింలో ముజారిటీ ప్రజలు బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వలస వచ్చినవారే. అయినా వారిని మమతా పెంచి పోషించారు. అయితే తాజాగా ముర్షిదాబాద్‌లో తృణమూల్ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ బాబ్రీ మసీదు నిర్మాణానికి ముందుకొచ్చి పార్టీకి సవాలు విసిరాడు. స్థానికులు భారీగా విరాళాలు, సామగ్రి సమర్పించడంతో విషయం విస్తరించింది. మమతా బెనర్జీ వెంటనే ఆయన్ను పార్టీ నుంచి తొలగించి డామేజ్ కంట్రోల్ చేస్తూ తీవ్ర చర్య తీసుకున్నారు. దీంతో హిందువుల్లో సానుభూతి పెరిగింది. బాబ్రీ కూల్చివేతకు వ్యతిరేకంగా ముస్లిం సమాజం నిరసనలకు మమతాబెనర్జీ అనుమతి ఇచ్చారు. ఇది వ్యూహాన్ని సంక్లిష్టం చేసింది. ఒకవైపు మసీదు నిర్మాణాన్ని అడ్డుకుని హిందువులకు అనుకూలంగా వ్యవరించి.. మైనారిటీలకు వ్యతిరేకమయ్యారు. ఇదే సమయంలో బాబ్రీ కూల్చివేత వ్యతిరేక ర్యాలీకి అనుమతి ఇచ్చి.. హిందువుల్లో ఉన్న సానుభూతి పోగొట్టుకున్నారు.ఎంఐఎంతోపాటు బెంగ్లాలోని మతగురువుల మద్దతులో ఎంఐఎం వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే ముస్లిం ఓట్లు విభజనకు దారితీస్తాయని మమతా ఆందోళన చెందుతున్నారు. తాను పెంచిన నేతలు మతోన్మాద రూపం తీసుకుంటే పార్టీ ఆధిపత్యం దెబ్బతింటుంది. వచ్చే ఎన్నికల్లో ఈ సంఘటనలు ప్రభావం చూపి కూటమి అధికారాన్ని బెంగాల్‌లో ఇబ్బంది పెట్టవచ్చు.మమతా బెనర్జీ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడిన ఎలక చందంగా మారింది. పార్టీ అంతర్గత ఘర్షణలు, మత రాజకీయాల సంక్లిష్టతను తెలియజేస్తోంది. మైనారిటీ మద్దతును కాపాడుకుంటూ మెజారిటీ సానుభూతిని కోల్పోకుండా సమతుల్యత అవసరం. ఈ వివాదం తృణమూల్ భవిష్యత్ వ్యూహాలను పునఃపరిశీలించేలా చేస్తుంది.2021లో బీజేపీతో జరిగిన తీవ్ర పోరాటం తర్వాత మమతా బెనర్జీ బెంగాల్ ఎన్నికలలో విజయం సాధించి ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో నాలుగు ప్రాథమిక రాజకీయ శక్తులు ఉన్నాయి. అవి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్? కాంగ్రెస్? పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, లెఫ్ట్ ఫ్రంట్. పశ్చిమ బెంగాల్?లో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుల లెఫ్ట్? ఫ్రంట్?లకు కచ్చితమైన చిన్న ఓటు బ్యాంకులు ఉన్నాయి. బెంగాల్‌లో బీజేపీ వేగంగా అభివృద్ధి చెందడం ప్రారంభించింది. 2021 రాష్ట్ర ఎన్నికలలో బీజేపీ 296 మంది ఎమ్మెల్యే స్థానాల్లో 77 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంది, ఇది బీజేపీకి భారీ లాభం. బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తోంది. బహుశా బీజేపీ 2021 కంటే ఎక్కువ ఎమ్మెల్యేలను గెలుచుకునే అవకాశం ఉంది. కానీ 28% ముస్లిం జనాభా ఉన్నందున బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కష్టం. పశ్చిమ బెంగాల్‌లో నరేంద్ర మోదీ ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. తమ రాష్ట్రం అక్రమ వలసదారులతో నిండిపోయిందని బెంగాలీ హిందువులు ఆందోళన చెందుతున్నారు. బెంగాలీలు కూడా తమ సంస్కృతిని మార్చుకోవాలని, పరిశ్రమలను స్వాగతించాలని తెలుసు. బెంగాలీలలో మార్పు నెమ్మదిగా వస్తోంది. కానీ, చారిత్రాత్మకంగా బెంగాల్ కూడా కొత్త ఆలోచనలకు తెరతీసింది. బీజేపీ వంటి జాతీయ పార్టీకి ఓటు వేయాలా వద్దా అని బెంగాలీలు నిశ్శబ్దంగా అంచనా వేస్తున్నారని చెప్పవచ్చు. అస్సాంలోలాగ బెంగాల్ రాజకీయాలను విదేశీయులు నిశ్శబ్దంగా నియంత్రిస్తున్నారనే ఆందోళన కూడా ఉంది. పశ్చిమ బెంగాల్‌లోనూ మార్పు రావొచ్చు, కానీ.. నెమ్మదిగా!వెస్ట్? బెంగాల్‌లో దాదాపు 28% జనాభా కలిగిన మైనారిటీ ఓటుబ్యాంకు ఉంది.

# విశాఖ మరో గ్రేటర్ పరిధి

విశాఖపట్టణం,°సెంబర్ 11 (భారత శక్తి)



విశాఖ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. జగన్ సర్కార్ విశాఖను పాలన రాజధానిగా ప్రకటించింది. కానీ ఎటువంటి అభివృద్ధి చేయలేదు. రుషికొండపై భవనాలు నిర్మించింది. కానీ అవి ఎందుకు నిర్మించిందో మాత్రం చెప్పలేదు. కూటమి ప్రభుత్వం అలా కాదు. విశాఖ నగరానికి పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమలను తెస్తోంది. మిగతా ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు అవుతున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. అనుబంధ పరిశ్రమలు సైతం పెద్ద ఎత్తున తరలివస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో విశాఖ నగరాన్ని మరింత విస్తరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ తరహాలో బల్దియా చేయాలనుకుంటోంది. తాజాగా వివిధ నియోజకవర్గాల్లో ఉన్న 70 పంచాయితీలను మహా విశాఖ నగరపాలక సంస్థలు విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకుంది.విశాఖ నగర ప్రస్థానం చూస్తే మాత్రం క్రమేపి ఎదుగుతూ వస్తోంది. అయితే వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టిపెట్టారు విశాఖపట్నం పై.. అయితే అది అభివృద్ధి పరంగా రాజకీయంగా తన ముద్ర చాటుకునేందుకు విశాఖను వేదికగా చేసుకున్నారు. ఎప్పుడు హడావిడితో నడిచేది వైసిపి హయాంలో విశాఖ నగరంలో. ప్రాంతీయ సమన్వయకర్తలతో పాటు వైసీపీ నేతల తాకిడి అధికంగా ఉండేది. దీంతో నగరవాసులు ఒక రకమైన ఆందోళన కనిపించేది. ఆ హడావిడి కి తగ్గట్టు ఎటువంటి అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు.. పైగా కొంతమంది వైసీపీ నేతలపై పెద్ద ఎత్తున భూకబ్జా ఆరోపణలు వచ్చాయి. ఆంధ్ర యూనివర్సిటీ భూముల్లో ప్రైవేట్ సంస్థల ఎంట్రీ అప్పట్లో జరిగింది. ఈ పరిణామాల క్రమంలో విశాఖ ప్రజలు చాలా ఆందోళనకు గురయ్యారు. అభివృద్ధి జరగకపోగా నగరంలో ఈ గందరగోళ పరిస్థితులు ఏమిటి అని ఎక్కువమంది ప్రశ్నించారు.మొన్నటి ఎన్నికల్లో విశాఖలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రజల్లో ఉన్న ఆందోళన కారణం. దానిని గుర్తించింది కూటమి ప్రభుత్వం. ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా విశాఖను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం విశాఖలో ఉన్న ప్రాంతాలన్నింటినీ గ్రేటర్ పరిధిలోకి తెచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇటు భీమిలి, అటు గాజువాక, పెందుర్తి పరిధిలో ఉన్న అన్ని పంచాయితీలు గ్రేటర్లో విలీనం కానున్నాయి. ఇటీవల పంచాయతీలు చేర్పుల మార్పులకు సంబంధించి ప్రభుత్వం ఉన్న నిషేధాన్ని తొలగించింది. దీంతో టీడీపీ ఎమ్మెల్యేలు ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి ఇచ్చారు. పంచాయితీ ఎన్నికల నిర్వహణకు ముందే ఈ 70 పంచాయితీలు గ్రేటర్ పరిధిలోకి రానున్నాయి. అయితే పరిస్థితి చూస్తుంటే మున్ముందు అటు విజయనగరం, ఇటు అనకాపల్లి పరిధిలో సైతం చాలా ప్రాంతాలు విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చి పరిస్థితి అయితే ఉంది. అదే జరిగితే గ్రేటర్ విశాఖ మరో బల్దియా కావడం ఖాయం.

===========

# మళ్లీ గుడివాడ రాజకీయాల్లోకి నాని



విజయవాడ, డిసెంబర్ 11 (భారత శక్తి)


మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ రాజకీయాల్లోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చారు. సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశీల రాజకీయ కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో కోర్టు వాయిదాలకు.. ముందస్తు బెయిల్ షరతుల్లో భాగంగా పోలీస్ స్టేషన్లలో సంతకాలు పెట్టడానికి వచ్చి వెళ్లిపోయేవారు. కానీ ఈ సారి రాజకీయ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కొడాలి నాని, గవర్నర్‌కు అందించే వినతిపత్రంలో సంతకం చేశారు. ఆ తర్వాత, వినతి పత్రాలను జిల్లా కమిటీకి అందించే పార్టీ శ్రేణుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ శ్రేణులతో కొడాలి నాని మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలనే మంచి సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు పునాదులు వేశారని కొడాలి నాని తెలిపారు. వైసీపీ పాలనలో ఐదు కళాశాలలు పూర్తి అయ్యాయన్నారు. మరో ఐదు కళాశాలల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని కానీ వాటిని పూర్తి చేయలేదన్నారు. పేద ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకోవాలంటే మాజీ సీఎం జగన్ ప్రజలతో కలిసి పోరాటాన్ని మొదలుపెట్టారని కొడాలి వివరించారు. తమ ఉద్యమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చిందని కొడాలి నాని ప్రకటించారు. ప్రజల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిష్టానికి అనుకూలంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఉద్యమంలో తమ సేకరించిన వినతి పత్రాలను వైసీపీ అధినేత జగన్ నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు మాజీ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. కొడాలి నాని ప్రభుత్వం మారగానే తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారని అనుకున్నారు. కానీ ఆయన గుడివాడకు రాకుండా ఉండటంతో పాటు గుండెనొప్పితో ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నారు. ముంబైలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో ఆయన కోలుకోవడానికి సమయం పట్టింది. రెడ్ బుక్ లో మొదటి పేరు కొడాలి నానితే ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతూ ఉంటాయి. ఆయన వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల పాటు విపరీతమైన భాషను ఉపయోగించేవారు. ఇప్పుడు ఆయన పూర్తిగా ఆరోగ్యంగా ఉండటంతో..టీడీపీ క్యాడర్ కూడా రెడ్ బుక్ మళ్లీ రెడీ అవుతుందని నమ్ముతున్నారు .

# తిరుమలలో మరో భారీ స్కాం

తిరుమల,డిసెంబర్ 11 (భారత శక్తి)

కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం.. భక్తిభావానికి, పవిత్రతకు నిలువుటద్దం. కానీ, ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న కుంభకోణాలు శ్రీవారి సన్నిధిలో అపవిత్రతను, అక్రమాలను కళ్లకు కడుతున్నాయి. లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి మరువక ముందే, ఇప్పుడు మరో భారీ మోసం బయటపడటం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దాతలు, విశిష్ట వ్యక్తులకు బహూకరించే పట్టు శాలువాల కొనుగోలులో పదేళ్లుగా సాగుతున్న అక్రమాలు టీటీడీ పాలనా వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెట్టాయి. పట్టు పేరుతో పాలిస్టర్ వస్త్రాలను అంటగడుతూ సాగిన ఈ దందా.. తిరుమలలో వేళ్నూనుకున్న అవినీతికి నిదర్శనంగా నిలుస్తోంది.శ్రీవారి దర్శనానికి వచ్చే ప్రముఖులకు, ఆలయానికి విరాళాలు అందించే దాతలకు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేసి పట్టు శాలువాతో సత్కరించడం తిరుమలలో సంప్రదాయం. ఈ క్రతువులో వాడే శాలువా సాక్షాత్తు శ్రీవారి ఆశీస్సుగా భావిస్తారు. నిబంధనల ప్రకారం, ఈ శాలువాలు స్వచ్ఛమైన మల్బరీ పట్టుతో, నిర్దేశిత బరువు, కొలతలతో ఉండాలి. వాటిపై ‘ఓం నమో వేంకటేశాయ’ అనే అక్షరాలతో పాటు శంకు, చక్ర నామాలు ఉండాలి. అయితే, ఇటీవల టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్. నాయుడు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల్లోగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2015 నుంచి టెండర్ దక్కించుకుని శాలువాలు సరఫరా చేస్తున్న నగరికి చెందిన ‘వీఆర్‌ఎస్ ఎక్స్‌పోర్ట్’ అనే సంస్థ, పదేళ్లుగా టీటీడీని, భక్తులను మోసం చేస్తోందని తేలింది. స్వచ్ఛమైన పట్టుకు బదులుగా 100 శాతం పాలిస్టర్ దారంతో తయారైన నాసిరకం శాలువాలను ఆ సంస్థ సరఫరా చేస్తోంది.ఈ కుంభకోణంలో ఆర్థిక అవకతవకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బయట మార్కెట్లో కేవలం రూ. 350 నుంచి రూ. 400 విలువ చేసే పాలిస్టర్ శాలువాలను, సదరు సంస్థ టీటీడీకి ఏకంగా రూ. 1,389 లకు విక్రయిస్తోంది. అంటే ఒక్కో శాలువాపై దాదాపు రూ. 1000కి పైగా అదనంగా వసూలు చేస్తూ, ఏటా కోట్ల రూపాయల ధనాన్ని కొల్లగొట్టింది. పదేళ్ల కాలంలో లక్షలాది శాలువాలు కొనుగోలు చేసిన టీటీడీ, ఈ మోసం కారణంగా ఎంత భారీ మొత్తంలో






నష్టపోయిందో ఊహించవచ్చు. ఇది కేవలం వ్యాపార మోసం కాదు, దేవుడి సొమ్మును అప్పనంగా దోచుకోవడమే. ఈ కుంభకోణం కేవలం ఒక కాంట్రాక్టర్ చేసిన మోసం మాత్రమే కాదు, టీటీడీ అధికారుల నిర్లక్ష్యానికి, పర్యవేక్షణా లోపానికి అద్దం పడుతోంది. ఒక పట్టు వస్త్రాన్ని చేతితో తాకితే అది పాలిస్టరా లేదా అసలైన పట్టా అనేది సాధారణ నేత కార్మికుడికి కూడా అర్థమవుతుంది. అలాంటిది, పదేళ్లుగా టీటీడీ అధికారులు, సిబ్బంది ఈ వ్యత్యాసాన్ని ఎందుకు గుర్తించలేకపోయారు? గతంలో కాంచీపురంలోని ల్యాబ్‌లో జరిగిన పరీక్షల్లో ఈ శాలువాలు నాణ్యమైనవేనని రిపోర్టులు వచ్చాయి. కానీ, ఇప్పుడు బెంగళూరు, ధర్మవరం సెంట్రల్ సిల్క్ బోర్డ్ ల్యాబ్‌లలో పరీక్షిస్తే అవి పాలిస్టర్ అని తేలింది. దీన్ని బట్టి, గతంలో ల్యాబ్ టెస్టుల సమయంలో నమూనాలను మార్చేశారా? లేక ల్యాబ్ అధికారులతోనే కుమ్మక్కయ్యారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి.తిరుమలలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు సాధారణ భక్తుల్లో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయి. పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని వాడారన్న ఆరోపణలు హిందూ సమాజాన్ని కుదిపేసాయి. శ్రీవారి హుండీని లెక్కించే పరకామణిలో సిబ్బందే డబ్బులు చోరీ చేస్తూ పట్టుబడటం భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపింది. ఇప్పుడు దాతలను గౌరవించే శాలువాల విషయంలోనూ మోసం జరగడం వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన అవినీతిని సూచిస్తోంది.ఈ వరుస ఘటనలు చూస్తుంటే.. తిరుమల పాలనా యంత్రాంగం పవిత్రత కంటే వ్యాపారానికి, అవినీతికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రస్తుత టీటీడీ పాలకమండలి, ఏసీబీ విచారణకు కోరడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే, ఇది కేవలం విచారణకే పరిమితం కాకూడదు. పదేళ్లుగా సాగిన ఈ దందా వెనుక ఉన్న కాంట్రాక్టర్లతో పాటు, వారికి సహకరించిన అధికారులను, సిబ్బందిని గుర్తించి కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. శ్రీవారి ఆలయం కేవలం ఒక ఆదాయ వనరు కాదు, కోట్లాది మంది భావోద్వేగాలకు, విశ్వాసానికి సంబంధించిన కేంద్రం. వరిపాలనలో పారదర్శకత, కొనుగోళ్లలో జవాబుదారీతనం ఉంటేనే తిరుమల పవిత్రత పరిరక్షించబడుతుంది. లేదంటే, ఇలాంటి కుంభకోణాలు పునరావృతమై, కలియుగ దైవం సన్నిధిపై భక్తులకు ఉన్న అచంచల విశ్వాసం సడలే ప్రమాదం ఉంది. తక్షణమే టీటీడీలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


# రాజ్యసభ కోసం పెద్ద పోటీ

విజయవాడ, డిసెంబర్ 11 (భారత శక్తి)

ఏపీలో వచ్చే ఏడాది మే జూన్ నెలల మధ్య జరగనున్న రాజ్యసభ ఎన్నికలు రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చర్చకు దారితీశాయి. ఈసారి నాలుగు స్థానాలు ఖాళీ కానుండగా, ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఈ నాలుగింటినీ టీడీపీ కూటమి గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి మొత్తం 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. అందులో ఇద్దరు టీడీపీ, ఇద్దరు బీజేపీ , మిగిలిన ఏడుగురు వైఎస్సార్‌సీపీకి చెందినవారు.వచ్చే జూన్ 21తో వైసీపీ నాయకులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీకాలం ముగుస్తుంది. అలాగే గత ఏడాది జరిగిన ఉపఎన్నికలలో టీడీపీ తరఫున గెలిచిన సానా సతీష్ పదవీకాలం కూడా అదే తేదీన పూర్తవుతుంది. ఈ కారణంగా ఎన్నికలు జూన్‌కు ముందే జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు ? టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఉండటంతో నాలుగు స్థానాల పంపకం ఎలా జరుగుతుందన్న ప్రశ్న మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటి వరకు జరిగిన రెండు ఉపఎన్నికల్లో టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు పొందగా, జనసేనకు ఇంకా అవకాశం రాలేదు. దీంతో ఈసారి జనసేనకు ఒక సీటు కేటాయించే అవకాశంపై చర్చ ఎక్కువైంది. గతంలో నాగబాబు కు అవకాశం వస్తుందని అనుకున్నా, బీజేపీ ఆ సమయంలో ఒత్తిడి తీసుకోవడంతో జనసేన వెనక్కి తగ్గాల్సి వచ్చింది. కాబట్టి ఈసారి బీజేపీ బదులుగా జనసేనకు అవకాశం ఇస్తారా? అనేది ప్రధాన చర్చాంశంగా మారింది.టీడీపీకి వచ్చిన సీట్లపై కూడా పార్టీ లోపలే పెద్ద పోటీ కనిపిస్తోంది. కేవలం ఏడాదిన్నరలోనే పదవీకాలం ముగిసే సానా సతీష్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆయన లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు కావడం, ఢిల్లీలోని కేంద్ర నాయకత్వం వద్ద మంచి పరిచయాలు ఉండటం ఈ అవకాశాలను పెంచుతున్నాయని అంటున్నారు. గతంలో ఈ బాధ్యతలను నిర్వర్తించిన కంభంపాటి రామ్మోహనరావు కూడా ఈసారి రాజ్యసభకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారముంది.ఇక టీడీపీకి చెందిన గల్లా జయదేవ్ , పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ , జవహర్తో పాటు సీనియర్ నాయకులు వర్ల రామయ్య , యనమల రామకృష్ణుడు వంటి పలువురు నేతలు కూడా రాజ్యసభ టికెట్ కోసం ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోసం సీటు వదులుకున్న పిఠాపురం వర్మకు పార్టీ ఏదైనా ప్రత్యామ్నాయం ఇవ్వాలని డిమాండ్ పెరుగుతోంది.అయితే, ఆశావహులలో ఎక్కువ మంది అగ్రవర్ణాలకు చెందినవారే ఉండటంతో, ఈసారి సామాజిక సమతుల్యాన్ని దృష్టిలో ఉంచి బీసీ, ఎస్సీ వర్గాలకూ అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో రాబోయే రాజ్యసభ ఎన్నికలు టీడీపీ కూటమిలో భారీ ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

# సంక్రాంతి తర్వాత జిల్లాల యాత్రలు

విజయవాడ, డిసెంబర్ 11 (భారత శక్తి)



వైసీపీ అధినేత వైఎస్ జగన్ కొత్త ఏడాది నుంచి యాక్టివ్ అయ్యేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఆయన జనవరి నెల సంక్రాంతి తర్వాత జిల్లాల యాత్రలు చేయాలని నిర్ణయించుకున్నారట. ఇక బెంగళూరుకు బైబై చెప్పి 2026 నుంచి ఇక విజయవాడలోని తాడేపల్లి నివాసంలో ఉండేందుకు ప్లాన్ చేసుకుంటున్నారని తెలిసింది. సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటన చేపట్టాలని తొలుత ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రోజుకు రెండు రోజుల పాటు జిల్లాల్లో పర్యటించాలని జగన్ ప్లాన్ చేసుకున్నారని సమాచారం. దీనివల్ల జిల్లా నేతలతో పాటు పార్టీ క్యాడర్ కూడా ఇక యాక్టివ్ అయ్యే అవకాశముందని భావించి తొలుత జిల్లాల టూర్ ను దాదాపు ఆరు నెలల పాటు విడతల వారీగా కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.జగన్ జిల్లాల పర్యటనల్లో ప్రజా సమస్యలపై స్పందించడంతో పాటు అక్కడ నియోజకవర్గానికి చెందిన నేతలతో పాటు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కూడా పాల్గొనేలా రోడ్ మ్యాప్ రెడీ చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా కార్యకర్తల సమాశాన్ని ఒకరోజంతా కొనసాగించాలని నిర్ణయించారని తెలిసింది. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడమే కాకుండా వారితో ఒకరోజు గడిపి తాను ఉన్నానన్న ధైర్యాన్ని నింపాలన్న ప్రయత్నంలో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నికలకు ఇంకా మూడేళ్లు మాత్రమే సమయం ఉన్నప్పటికీ ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున ఈలోపు జిల్లాల పర్యటనలు చేసి క్యాడర్ ను ఉత్తేజ పర్చాలని జగన్ భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంలో జగన్ ఇక కార్యకర్తలకు, నేతలకు అందుబాటులో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారని, ఈ మేరకు ఇప్పటికే నియోజకవవర్గాల నేతలకు కూడా సమాచారం అందించారని తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గాల ఇన్ ఛార్జులను మార్చిన జగన్ త్వరలోనే అన్ని నియోజకవర్గాలకు పూర్తి స్థాయి నియామకాలు చేపట్టడమే కాకుండా బూత్ లెవెల్ కమిటీల ఏర్పాటు ఎంత వరకూ వచ్చిందన్న దానిపై కూడా ఫోకస్ పెట్టనున్నట్లు తెలిసింది. కొత్త ఏడాది నుంచి జగన్ నయా ప్లాన్ తో జనం ముందుకు వెళ్లాలన్న యోచనలో ఉన్నారు. అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లేలా జగన్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ కేసులకు భయపడి బయటకు రాని నేతలు కూడా ఇక బయటకు వస్తారని పార్టీ నాయకత్వం భావిస్తుంది. రాకపోతే ప్రత్యామ్నాయ నేతలను నియమించడానికి తగిన సమయం కూడా తమకు ఉంటుందని అంటున్నారు.

# 37 మందిలో మార్పు కనిపించడం లేదా

గుంటూరు, డిసెంబర్ 11 (భారత శక్తి)

తెలుగుదేశం పార్టీకి చెందిన 37 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని పార్టీ అధినేత చంద్రబాబుకు నివేదిక అందింది. బ్యాక్ ఎండ్ టీం ఇచ్చిన నివేదిక మేరకు రాష్ట్రంలో 37 మంది ఎమ్మెల్యేల పనితీరు ఇప్పటి వరకూ ఏమాత్రం మెరుగుపడలేదని నివేదిక ఇచ్చింది. అయితే ఇది వారికి ఫైనల్ కాల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినట్లు తెలిసింది. గత కొన్నాళ్లుగా అందుతున్న నివేదికలను అనుసరించి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేల పనితీరును మెరుగుపర్చుకోవాలని పదే పదే చెబుతున్నారు. ప్రజల్లోనే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెబుతున్నారు. అయినా పెద్దగా ఎమ్మెల్యేలు లెక్కచేయని పరిస్థితి ఉందని ఈ లెక్కలు చెబుతున్నాయి.ప్రతి నెల సాక్షాత్తూ చంద్రబాబుతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛను పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పినప్పటికీ కొందరు ఎమ్మెల్యేలు దూరంగా ఉంటున్నారు. అలాగే సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలను కూడా స్వయంగా ఎమ్మెల్యేలు చేయాలని చెప్పినా లైట్ తీసుకుంటున్నారు. అనేకసార్లు చంద్రబాబు వారికి క్లాస్ లు పీకారు. అయితే గుంపులో గోవిందా అన్నట్లుగా వారు తమను కాదులే అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు కూడా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఎమ్మెల్యేల పనితీరును మెరుగుపర్చుకోకపోవడం పై ఒక వరసగా వన్ టూ వన్ సమావేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.త్వరలోనే ఒక్కొక్క ఎమ్మెల్యేను పిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా వారితో మాట్లాడేందుకు సిద్ధం చేయాలని పార్టీ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. 37 మంది పనితీరు బాగాలేదంటే చిన్న విషయం కాదు. చిన్న అంకె కూడా కాదు. వారి వల్ల భవిష్యత్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుపై పడే అవకాశం కూడా ఉందని భావించిన చంద్రబాబు నాయుడు ఇది ఫైనల్ కాల్ అని, అప్పటికీ వారు పనితీరు మార్చుకోకపోతే, వచ్చే ఎన్నికల్లో వారిని తప్పించి మరొకరిని అభ్యర్థిగా ఎంపిక చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అందుకే చివరి హెచ్చరికలతోనైనా వారు తమ వ్యాపారాలను, ఇతర వ్యవహారాలను పక్కన పెట్టి నియోజకవర్గాల్లోనే ఉండి ప్రజా సేవ చేయాలని చంద్రబాబు గట్టిగా క్లాస్ పీకుతారంటున్నారు. అప్పటికైనా మారతారా? లేదా? అన్నది చూడాలి

మంత్రులకు క్లాస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈరోజు జరిగిన హెచ్ఓడీల సమావేశంలో మంత్రుల పనితీరును ఆయన తప్పుపట్టారు. మరోసారి మంత్రులపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఇప్పుడు అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. మంత్రుల పనితీరులో ఎలాంటి మార్పు రాలేదని చంద్రబాబు అన్నారుచాలా మందికి తమ శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడంలేదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తేవడం, వినియోగించడంలో



విఫలమయ్యారంటూ అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు ఒక్కరోజు ఢిల్లీకి వెళ్లడంలో నష్టం లేదన్న చంద్రబాబుర ఇకనైనా మంత్రులు పనితీరు మార్చుకోవాలని, ఫైళ్ల క్లియరెన్స్ లోనూ వేగంగా స్పందించాలని చంద్రబాబు ఆదేశించా

# పిన్నెల్లి సోదరులకు 14 రోజుల రిమాండ్

గుంటూరు, డిసెంబర్ 11 జంట హత్యల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి మాచర్ల కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

# పడకేసిన రియల్ ఎస్టేట్..




అమరావతి, డిసెంబర్ 11 (భారత శక్తి)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతి ప్రాంత రైతులకు సంబంధించిన భూముల విలువ ధమాల్ అని పడిపోయింది. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో రాజధాని ప్రాంతంలో ఎకరం భూమి నలభై లక్ష రూపాయలు చేసే భూమి ఒక్కసారిగా ఎనభై లక్షల రూపాయల వరకూ పలికింది. రాజధాని ఇక్కడకు వస్తుందని తెలిసి అనేక మంది కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రాజధాని ప్రాంతమే కాకుండా గుంటూరు జిల్లాలోని భూములకు కూడా ఒక్కసారి ధరలు పెరిగాయి. అక్కడకు కార్లలో అధిక సంఖ్యలో రియల్ వ్యాపారులు వచ్చి భూములుబేరాలు ఆడి కొనేవారు. కానీ నేడు బేరమాడే వారు కూడా లేరు.అయితే 2019 ఎన్నికలలో జగన్ వచ్చి మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చిన వెంటనే తిరిగి ఎకరం భూమి నలభై లక్షల రూపాయలకు చేరింది.దీంతో ఈ ప్రాంత వాసులు ముఖ్యమంత్రిగా చంద్రబాబు తిరిగి ఎన్నికయ్యేందుకు దోహదపడ్డారు. వారి ఆందోళనలు ఒకరకంగా పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే చంద్రబాబు వచ్చిన తర్వాత అనుసరిస్తున్న పద్ధతులు, వరసగా భూ సమీకరణలు చేస్తుండటంతో మళ్లీ రియల్ ఎస్టేట్ స్తబ్దత నెలకొనిందంటున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కొందరు రియల్ వ్యాపారులు ఇక్కడకు వచ్చి భూములు కొనుగోలు చేసి వెంచర్లను ఏర్పాటు చేశారు. కొందరు అపార్ట్ మెంట్లు నిర్మించారు. నేడు అపార్ట్ మెంట్ల ధరలు కూడా గతంలో మాదిరిగా లేవంటున్నారు. గతంలో అమరావతి రాజధాని హైప్ చూసి భూమిని కొనుగోలు చేసిన వారు ఇప్పుడు అమ్మాలన్నా కొనేవారు లేరని వాపోతున్నారు.అమరావతిలో తొలి విడత ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన భూములు ఇంత వరకూ అభివృద్ధి చేయకుండా రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం వెళ్లడం, మూడో విడత కూడా ఉందనిచెప్పడంతో భూముల ధరలు ధమాల్ అంటున్నాయట. ఇందుకు అమరావతికి చెందిన ఒక రైతు ఉదాహరణ చెప్పారు. ఎక్కడైనా ఒక వీధిలో ఒక షాపు ఉంటే దానికి గిరాకీ ఉంటుంది. అదే వీధిలో మరొక షాపు ఏర్పాటయితే గిరాకీ తగ్గిపోతుంది. ఇప్పుడు రెండోసారి భూ సమీకరణ విషయంలో తాము కూడా ఇలాగే అన్యాయానికి గురవుతున్నామని చెబుతున్నారు. తాము రాజధానికి వ్యతిరేకం కాదంటూనే తమకు ప్లాట్లను అభివృద్ఇ చేయకుండానే మరొకరికి ప్లాట్లు కేటాయించడంతో భూముల ధరలు తగ్గిపోయాయని, జేఏసీ నేతలతో మాట్లాడి ఫలితం లేదని, గ్రామ సభలు జరిపి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించాలి కదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

# ఇండిగో సంక్షోభం

## కుట్ర కోణంలో దర్యాప్తు

ముంబై, డిసెంబర్ 11 (భారత శక్తి)

ఇండిగో సంస్థకు సంబంధించిన విమానాలు అర్థంతరంగా ఆగిపోవడం మనదేశంలో తీవ్ర కలవరాన్ని కలిగించాయి.. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు విమానాశ్రయాలకు పరిమితమయ్యారు. ఉన్నట్టుండి విమానాలు ఆగిపోవడంతో ప్రయాణికులు నరకం చేశారు.. వాస్తవానికి విమానాలు ఆగిపోవడం మన దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు.. ఇతర సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు విమానాలను నిలిపివేస్తారు. కానీ ఎటువంటి కారణాలు లేకుండానే ఇండిగో సంస్థ విమానాలు ఆపివేయడం దేశవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణాన్ని కలిగించింది.విమానాలు ఆగిపోవడం వెనక టర్కీ దేశం పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తోందని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇండిగో సంస్థకు టర్కీస్ ఎయిర్ లైన్స్ తో విస్తృతమైన కోడ్ షేర్ బాండింగ్ ఉంది. టర్కీస్ ఎయిర్లైన్స్ ను నేరుగా టర్కీ ప్రభుత్వమే నియంత్రిస్తోంది.కొన్ని సంవత్సరాలుగా భారత్, టర్కీ మధ్య అంత గొప్పగా సంబంధాలు లేవు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ కు టర్కీ బహిరంగ మద్దతు పలికింది. దీంతో భారతీయ కంపెనీలు టర్కీని బహిష్కరించాయి.. అంతేకాదు టర్కీ అధ్యక్షుడి కుమార్తెకు ప్రయోజనం కలిగించే సెలెబి ఏర్పోర్ట్ సర్వీసెస్ కాంట్రాక్టు ను భారత రద్దు చేసింది. అహ్మదాబాదులో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురికావడానికి ముందు మనదేశంలో టర్కీ దేశానికి చెందిన విమానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత ప్రజలు సహజంగానే ఎయిర్ ఇండియా వైపు దృష్టిస్తారించారు. ఈ కుట్ర అనేక రకాలుగా మలుపులు తిరిగింది.. పుతిన్ మనదేశంలో పర్యటిస్తున్నప్పుడే పశ్చిమ దేశాలు సరికొత్త వ్యూహాలు అవలంబించాయి.. లెట్ల విశ్రాంతి సమయాన్ని.. రాత్రి కాలంలో ఆపరేషన్ల నియమాలను అత్యంత కఠిన తరం చేసింది. దీంతో రోజుకు 2300 విమానాలను నడిపే ఇండిగో సంస్థ మీద విపరీతమైన ఒత్తిడి పడింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

No. : CEE/P/SC-2x25kV-OHE-KMT-DKJ-BDCR-2025-26-01, Dated : 11.12.2025 PUB/1587

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్ ఈ క్రింది పనులకు (ఆన్‌లైన్) ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తోంది.

టెండర్ సంఖ్య : 2x25kV-OHE-KMT-DKJ-BDCR, Dt.10/12/2025 పని వివరణ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్‌లోని ఖమ్మం (KMT)(మినహాయింపు) -డోర్నకల్ (DKJ)(మినహాయింపు) - భద్రాచలం రోడ్ (BDCR)(మినహాయింపు) సెక్షన్‌లో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనులతో ఉన్న 1x25kV వ్యవస్థను 2x25kV AT ఫీడింగ్ సిస్టమ్‌కు OHE అప్‌గ్రేడ్ చేయడానికి డిజైన్, సరఫరా, నిర్మాణం, పరీక్ష మరియు కమీషనింగ్, మొత్తం 78 RKM/ 101 TKM అంచనా వ్యయం (రూ): 50,37,51,882.87, ఈఎండి ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి (రూ): 26,68,800.00. టెండర్ ఫారం ధర (రూ): 0. పూర్తిచేయు కాలం : 15 నెలలు (పదిహేను నెలలు) టెండర్ తెరిచే స్థలం : సికింద్రాబాద్

1) ఈ-టెండర్ ద్వారా ముగింపు టెండర్ ఆన్‌లైన్ సమయం : 15.00, తేదీ:28/01/2026

2) ఈ-టెండర్ (ఆన్‌లైన్ )ద్వారా టెండర్ తెరిచే సమయం : 15.30, తేదీ:28/01/2026

టెండర్ తెరిచే తేదీ తరువాత సెలవు దినంగా ప్రకటించబడుతుంది, తదుపరి పని దినం నిర్ణీత సమయంలో టెండర్లు తెరవ బడతాయి.
టెండర్ నిబంధనలు/వివరాలు మరియు టెండర్ల సమర్పణ కోసం, దయచేసి మా వెబ్‌సైట్ www.ireps.gov.in ని సందర్శించండి.
గమనిక: టెండర్ పాత్రాలు/దిద్దుబాటు/ అనుబంధంలో ఏవైనా మార్పులు అవసరమైతే పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయి.
చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్

NOTICE INVITING e-TENDER (throught https://ireps.gov.in) PUB/1588

భారత రాష్ట్రపతి తరపున సికింద్రాబాద్‌లోని ఎస్.సి.రైల్వే, వరుసగా CE/C/Plg&Sy/SC, CE/ C-VI/SC&CE/C-II/SC నిర్మాణ సంస్థ, ఈ క్రింది పనులకు ఇ-టెండర్‌లను ఆహ్వానిస్తోంది.

1. NIT నం. 32-CAO-C-SC-2025 తేదీ:05/ 12/2025 పని పేరు: SCR నిర్మాణ సంస్థ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ డివిజన్‌లోని నిజామాబాద్ స్టేషన్‌లో RGB భవనం, గూమ్టీ భవనం, అధికారులు మరియు సూపర్‌వైజర్ విశ్రాంతి గృహం మరియు సిబ్బంది క్వార్టర్లు మొదలైన వాటి నిర్మాణానికి ప్రతిపాదిత ప్రతిపాదన. అంచనా వ్యయం (రూ): 22,00,28,684, ఈఎండి (రూ): 12,50,200.00. పూర్తిచేయు కాలం : 18 నెలలు (పద్దెనిమిది నెలలు) తేదీ & ప్రారంభ సమయం : 20/12/ 2025, 15.00 గంIIలకు

2. NIT నం. EPC12-CAD-C-SC-2025 తేదీ:08/12/2025 పని పేరు: SCR నిర్మాణ సంస్థ ఇంజనీరింగ్, సేకరణ మరియు నిర్మాణం (EPC) తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్-ధోన్ సెక్షన్ డబ్లింగ్‌కు సంబంధించి విద్యుదీకరణ & సిగ్నలింగ్ పనులతో సహా గద్వాల్ స్టేషన్ నుండి అలంపూర్ రోడ్ స్టేషన్ మధ్య ట్రాక్ డబ్లింగ్ కోసం ఒప్పందం. అంచనా వ్యయం (రూ): 562,70,49,413.00, ఈఎండి (రూ): 2,00,00,000.00. పూర్తిచేయు కాలం : 30 నెలలు (ముప్పై నెలలు) ప్రారంభ తేదీ, సమయం: 06/03/2026, 15.00 గంIIలకు

3. NIT నం. EPC10-CAO-C-SC-2025 తేదీ:06/12/2025 పని పేరు: దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ సంస్థ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మోటుమారి-విష్ణుపురం డబ్లింగ్‌కు సంబంధించి విద్యుదీకరణ & సిగ్నలింగ్ పనులతో సహా సంత్ సేవాలాల్ మహారాజ్ నుండి విష్ణుపురం స్టేషన్ల మధ్య ట్రాక్ డబ్లింగ్ కోసం ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు కన్‌స్ట్రక్షన్ (EPC) ఒప్పందం. అంచనా వ్యయం (రూ): 439,45,79,122.92, ఈఎండి (రూ): 2,00,00,000.00. పూర్తిచేయు కాలం : 24 నెలలు (ఇరవై నాలుగు నెలలు) ప్రారంభ తేదీ, సమయం: 05/03/2026, 15.00 గంIIలకు

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం, దయచేసి వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.
2) టెండర్ సమర్పణ వ్యవధిలో, అంటే టెండర్ ముగింపుకు ముందు పదిహేను రోజుల వ్యవధిలో టెండర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
3) టెండర్లు టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకు ఏవైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడినవి) కోసం గమనించాలి.
చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/కన్‌స్ట్రక్షన్, సికింద్రాబాద్

Tender No. : 31-PA-25-26-Sr. DEE-M-HYB, 32-GSU-25-26-Sr, DEE-M-HYB PUB/1589

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ ఈ క్రింది టెండర్ల ముగింపు తేదీకి ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. తేదీ : 06-01-2026, 15.00.. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్‌లు స్వీకరించబడిన ఏవైనా విస్మరించబడతాయి.

పని వివరణ : టెండర్ నెం. : 31-PA-25-26-Sr. DEE-M-HYB: హైదరాబాద్ డివిజన్ 1) BSX-PF నం.4, షెల్టర్ (COP), రిటైనింగ్ వాల్ మరియు exg. పొడిగింపు యొక్క కేటాయింపు. 2027 గోదావరి పుష్కరం సందర్భంగా న్యూ హోల్డింగ్ ఏరియా అభివృద్ధిలో భాగంగా ప్లాట్‌ఫాం 4కు - FOB విద్యుత్ ఏర్పాటు. 2) SC-MUE విభాగం : COP కేటాయింపు a) PF1 పై 25 మీటర్ల పొడవు మరియు PF 2/3 పై 160 మీటర్ల పొడవుకు NZB, b) PF1 పై 300 మీటర్ల పొడవు మరియు PF 2/3 పై 200 మీటర్ల పొడవుకు KMC, c) PF1 పై 210 మీటర్ల పొడవు మరియు PF 2 పై 160 మీటర్ల పొడవుకు BSX విద్యుత్ ఏర్పాట్లు. 3) 16 హాల్ట్ స్టేషన్లలో (HG-2/3) దివ్యాంగజన సౌకర్యాలను అందించడం మరియు HYB డివిజన్ విద్యుత్ ఏర్పాట్లలోని స్టేషన్లలో టాయిలెట్లు అప్‌గ్రేడేషన్. అంచనా వ్యయం (రూ) : 3,84,29,392/- ఈఎండి (రూ): 3,42,200/- పూర్తిచేయు కాలం : 12 నెలలు. ముగింపు తేదీ : 06.01.2026

పని వివరణ : టెండర్ నెం. : 32-GSU-25-26- Sr. DEE-M-HYB: 1) SC-MUE విభాగం : ట్రాక్ సర్క్యూట్ యొక్క పునఃస్థాపన మల్టీ సెక్షన్ డిజిటల్ ఆక్సిల్ కౌంటర్‌తో on Sitafalmandi B - Malkajgiri-Cavalry బ్యారక్స్-బొలారం ఆటో సెక్షన్లు-విద్యుత్ ఏర్పాట్లు. 2) అనలాగ్ యాక్సిల్ కౌంటర్ యొక్క పునఃస్థాపన ఆన్ మొత్తం మీద MSDAC ఉన్న లూప్ లైన్లు VDI, GWD, KQQ, WPR వద్ద స్టేషన్, MQN & BDHN స్టేషన్లు-ఎలక్ట్రికల్ ఏర్పాట్లు. 3) భర్తీ MSDAC ఆన్‌లో ఉన్న ట్రాక్ సర్క్యూట్ సీతాఫల్‌మండి ఎ- కాచిగూడ- ఫలక్‌నుమా ఆటో సెక్షన్లు-ఎలక్ట్రికల్ ఏర్పాట్లు. 4) భర్తీ మెకానికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బారియర్ ఎలక్ట్రికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బారియర్‌తో 16వ నెంబర్ ఇంజనీరింగ్ ఇంటర్ లాక్డ్ LC వద్ద గేట్లు - విద్యుత్ ఏర్పాట్లు. 5) ప్రతిపాదిత వంతెన నిర్మాణం KM 555/03-04 వద్ద నెం.: 636A(ROB) రెండు లేన్ల ట్రాఫిక్ కోసం LC నెం. 228T స్థానంలో చేగుంట - మెదక్ రోడ్డులో KM.0/04 - వాడియారామ్ మరియు మసాయిపేట మధ్య 06 స్టేషన్లు-విద్యుత్ ఏర్పాట్లు. 6) JKM-BDHN :మనుషుల నిర్మూలన కి.మీ. వద్ద లెవెల్ క్రాసింగ్ గేట్ నెం. 17/JB RUB అందించడం ద్వారా 17/900-18/ 0 JKM-BDHN స్టేషన్ల మధ్య- విద్యుత్ ఏర్పాట్లు. అంచనా వ్యయం (రూ) : 1,07,93,923/- ఈఎండి (రూ): 2,04,000/- పూర్తిచేయు కాలం : 12 నెలలు. ముగింపు తేదీ : 06.01.2026

వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in
టెండర్ పూర్తి వివరాలతో సీనియర్ డిఇఇ / ఎం/ హెచ్‌వైబి కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్ - 500071 కార్యాలయం నోటీసు బోర్డులో చూడవచ్చు.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఎం / హైదరాబాద్
A 2016
మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

# రూ 315 కోట్లకు తాజా బంజారా సోల్డ్

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి)




హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో కీలక ఒప్పందం జరిగింది. ప్రఖ్యాత తాజ్ బంజారా హోటల్‌ను అరబిందో గ్రూప్‌కు చెందిన ఆరో రియాల్టీ రూ. 315 కోట్లకు కొనుగోలు చేసింది. 16,645 చదరపు యార్డ్స్‌లో విస్తరించి ఉన్న ఈ లగ్జరీ ప్రాపర్టీలో.. 1.22 లక్షల చదరపు అడుగుల బిల్ట్-అప్ ఏరియా ఉంది. ఈ లగ్జరీ హోటల్‌లో 270 గదులతో ఉన్నాయి. కాగా, ఈ ఏడాది ప్రారంభం నుంచి బంజారా హిల్స్‌లో రియల్ ఎస్టేట్ ధరలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో కీలక ఒప్పందం జరిగింది. నగరంలో ప్రఖ్యాత లగ్జరీ హోటళ్లలో ఒకటైన 'తాజ్ బంజారా'ను అమ్మేశారు. అరోబిందో గ్రూప్‌కు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ.. ఆరో రియాల్టీ ఈ హోటల్ ప్రాపర్టీని రూ. 315 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 31న దీనికి సంబంధించిన లావాదేవీలు పూర్తైనట్లు సమాచారం. నగరంలో జరిగిన ముఖ్యమైన ఒప్పందాల్లో ఒకటిగా ఈ తాజ్ బంజారా డీల్ నిలిచిందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. తాజ్ బంజారా కొనుగోలుకు స్టాంప్ డ్యూటీ కింద రూ. 17.3 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. కాగా, హోటల్ బంజారా లిమిటెడ్ సంస్థకు చెందిన ఈ తాజ్ బంజారా.. 16,645 చదరపు యార్డ్స్ విస్తీర్ణం కలిగిన ల్యాండ్ పార్సల్‌లో ఉంది. ఇందులో బిల్ట్-అప్ ఏరియా 1.22 లక్ష చదరపు అడుగులు. ఈ హోటల్‌లో మొత్తం 270పైగా గదులు ఉన్నాయి. అయితే, గత రెండు సంవత్సరాలుగా పన్నులు చెల్లించకపోవడంతో.. ఈ ఏడాది ప్రారంభంలో జీహెచ్ఎంసీ అధికారులు తాజ్ బంజారాను లాక్ చేసినట్లు తెలుస్తోంది. అయితే కొంత మొత్తంలో పన్నులు చెల్లించడంతో తిరిగి ప్రారంభమైనట్లు సమాచారం. మరోవైపు, కొత్తగా కొనుగోలు చేసిన ప్రాపర్టీని ఆరో రియాల్టీ ఎలా ఉపయోగించుకోనుంది అనే విషయంపై ఆ కంపెనీ వివరాలు వెల్లడించలేదు. కాగా బంజారా హిల్స్.. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. ఇక్కడ విలాసవంతమైన నివాస ప్రాంతాలు, లగ్జరీ హోటళ్ళు, కార్పొరేట్ కార్యాలయాలు, ప్రీమియం రిటైల్ కార్యకలాపాలకు ప్రసిద్ధి చెందింది. చాలా మంది ప్రముఖులు ఈ ప్రాంతంలోనే నివసిస్తారు. 2025 ప్రారంభం నుంచి బంజారాహిల్స్‌లో రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కుష్మాన్ అండ్ వేక్‌ఫీల్డ్ డేటా ప్రకారం.. బంజారా హిల్స్‌లో ధరలు ఈ ఏడాది సుమారు 8 శాతం పెరిగాయి. సగటున చదరపు అడుగుకు రూ. 12,000? రూ. 15,000 పెరిగాయట. ఇంతకుముందు కూడా తాజ్ బంజారా లాంటి కీలక ఒప్పందాలు జరిగాయి. డిసెంబర్ 2న వీవర్క్ ఇండియా అనే కంపెనీ.. హైదరాబాద్ హైటెక్ సిటీలో ఉన్న స్కైవ్యూ 20 టెక్ పార్క్‌లో.. 1.75 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఐదు సంవత్సరాల కాలానికి లీజుకు తీసుకుంది. అందుకోసం రూ. 1.72 కోట్ల ప్రారంభ నెలవారీ అద్దె చెల్లించనుంది. అయితే ఇందులో రెండు అంతస్తుల స్థలాన్ని జేపీ మోర్గాన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 60 నెలల పాటు.. రూ. 4.38 కోట్ల ప్రారంభ నెలవారీ అద్దెకు సబ్-లీజుకు ఇవ్వడం గమనార్హం.

# ముంబై స్థాయిలో హైదరాబాద్ నాలుగు కార్పొరేషన్లు

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి)

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తూ, పరిధిలోని 27 పెరిఫెరల్ అర్బన్ లోకల్ బాడీలను విలీనం చేషశారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ వార్డుల సంఖ్యను 150 నుండి 300 కు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు (ఊ) జారీ చేసింది. పట్టణ పాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా, ఈ విస్తరణకు అనుగుణంగా వార్డుల సంఖ్యను రెట్టింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ఉన్న 150 వార్డుల స్థానంలో ఇకపై 300 వార్డులు×× ఉంటాయి. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయడంతో ఈ మార్పు అనివార్యమైంది. విస్తరించిన హైదరాబాద్ పరిధిని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణిస్తున్నారు. వార్డుల సంఖ్య పెంపు ద్వారా ప్రతి వార్డు పరిధి తగ్గి, కార్పొరేటర్లు ప్రజలకు మరింత చేరువగా ఉండటానికి, సమస్యలను త్వరగా పరిష్కరించడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇది మెరుగైన పౌర సేవలు , మౌలిక వసతుల కల్పనకు దోహదపడుతుంది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా వార్డుల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర అధ్యయనం చేయించారు. ఆ నివేదిక ఆధారంగానే ఈ పెంపునకు ఆమోదం లభించింది. అయితే ఇంత పెద్ద ప్రాంతానికి ఒకే మేయర్ ఉండటం కష్టమనితర్వాత డీసెంట్రలైజ్ చేసి మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా విభజించే ప్రణాళికలు ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం 300 వార్డులు, 300 ఎన్నికైన కార్పొరేటర్లు ఉంటారు. ఇది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టానికి అనుగుణంగా జరిగింది. ప్రస్తుతం గ్రేటర్ పరిధి 650 చ.కి.మీ.లు మాత్రమే ఉండగా, 27 మున్సిపాలిటీలు, 1 గ్రామ పంచాయతీలను కలిపిన తర్వాత ఇది 2,000 చ.కి.మీ.లకు చేరుకుంటుంది. జనాభా 1.3 కోట్లకు పైగా ఉండగా, ప్రతి వార్డులో 40,000-50,000 మందులు ఉంటారు. సర్కిల్స్ సంఖ్య 30 నుంచి 57కి పెరిగింది. ప్రతి మెర్జ్ అయిన మున్సిపాలిటీని ఒక సర్కిల్‌గా పరిగణిస్తారు. గ్రేటర్ విస్తరణ తర్వాత, దీనిని మూడు లేదా నాలుగు చిన్న



కార్పొరేషన్లుగా విభజించే ప్రణాళికలు ఉన్నాయి. ఫలితంగా, ప్రస్తుత ఒక మేయర్ పదవి కాకుండా నాలుగు మేయర్ స్థానాలతో కార్పొరేషన్లు ఏర్పడే అవకాశం ఉంది. మూడు వందల మంది కార్పొరేటర్లతో అంటే పాలన కూడా గందరగోళంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే నాలుగు కార్పొరేషన్లు చేసి..నలుగురు మేయర్లు బాధ్యతలు నిరవహించే అవకాశాలు ఉన్నాయి. వార్డుల సంఖ్య ఖరారు కావడంతో వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను ఉఊఓఅ త్వరలో చేపట్టనుంది. ఈ ప్రక్రియలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిపాలనా విభాగాలతో సమన్వయం చేసుకోనుంది. ప్రస్తుత ఉఊఓఅ కౌన్సిల్ టర్మ్ ఫిబ్రవరి 11, 2026కు ముగుస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశంఉంది. ఇప్పటికి అయితే 300 వార్డులతో ఎన్నికలు జరిగితే, కాంగ్రెస్, ఃఖీూ, ఃఏఖ, ంఎఓఎఓ మధ్య తీవ్ర పోటీ జరుగుతుంది. 2020 ఎన్నికల్లో ఃఖీూ 56 సీట్లు, ఃఏఖ 48, ంఎఓఎఓ 44, కాంగ్రెస్ 2 సీట్లు సాధించాయి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఫేవరేట్ గా బరిలోకి దిగనుంది.

# కేటీఆర్ పుత్రోత్సాహం.. హిమాన్స్ ఫస్ట్ ఎక్స్పీరియన్స్ వైరల్





హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి)

కేటీఆర్.. తెలంగాణ ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా, ఆయన కొడుకుగా.. కేటీఆర్ తెలంగాణకు ముఖ్యమైన మంత్రిగా పనిచేవారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. దీంతో ప్రస్తుతం పార్టీ వర్కింగ్ ప్రెడిసెంట్‌గా బాధ్యతలు చూసుకుంటున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పాత్ర పోషిస్తున్నారు. కేటీఆర్ వారసుడు.. కేసీఆర్ మనుమడు.. కల్వకుంట్ల హిమాన్షు కూడా 2023 ఎన్నికల సమయంలో పార్టీ తరఫున ప్రచారం చేశారు. అయితే చాలా మందికి ఆయన కేసీఆర్ ద్వారానే పరిచయం అయ్యాను. ముఖ్యమంత్రిగా ఏ కార్యం తలపెట్టినా మనుమడిని వెంట తీసుకెళ్లేవారు. భద్రాద్రి సీతారాముల కళ్యానానికి మనుమడితో తలంబ్రాలు పంపించారు. ఇది అప్పట్లో వివాదాస్పదమైంది. ఇదంతా ఎందుకంటే.. ఆ హిమాన్స్ ఇప్పుడు అమెరికాలో చదువుకుంటున్నాడు. రాష్ట్రంలో చదువుకుంటున్న మయంలోనే ప్రతిభ చాటుకున్నాడు. ఇప్పుడు అమెరికాలో.. సొంతంగా ఉద్యోగం సాధించాడు. అమెరికాకు స్టూడెంట్‌గా వెళ్లిన హిమాన్షు ఇప్పుడు.. అక్కడే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. తరగతి గదిలో విద్యార్థిగా ఉన్నప్పటి నుండి ఉపాధ్యాయుడిగా మారిన దశ ఆశ్చర్యకరమైనది, ఇది వ్యక్తిగతంగా ప్రత్యేక అనుభూతిని కలిగిందని హిమాన్షు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక తన తొలి ఉద్యోగం అనుభవాన్ని లింక్డ్ ఇన్‌లో పోస్టు చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. హిమాన్షు పోస్టుపై నెటిజన్లు స్పందిస్తున్నారు. తండ్రికిదగ్గ తనయుడు అని పోస్టులు పెడతున్నారు. గతంలో కేటీఆర్ కూడా అమెరికాల జాబ్ చేశాడని, తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడని, హిమాన్షు కూడా అమెరికాలో జాబ్ కొట్టాడని.. భవిష?యత్‌లో తెలంగాణ రాజకీయాల్లో రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక చాలా మంది హిమాన్షుకు ఆల్ దిబెస్ట్ చెబుతూ పోస్టులు పెట్టారు. అమెరికాలో ఉన్నత విద్య పూర్తిచేసి, ఉద్యోగంలో అడుగుపెట్టడం హిమాన్షు కృషి, నేర్చుకునే ధోరణిని ప్రతిబింబిస్తోంది. ఈ మార్పు యువతకు ప్రేరణగా నిలవచ్చని భావిస్తున్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి, గ్రామానికి అభివృద్ధి చేస్తా: సర్పంచ్ అభ్యర్థి మారుతి రాజన్న

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 11 (భారత శక్తి): కుబీర్ మండలలోని ధర్ కుబీర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా పోటీ చేస్తున్నారు. తోకల మారుతి రాజన్న విలేకరులతో మాట్లాడుతూ కుబీర్ మండలానికి 2కిమి. దూరము లో ఉన్న అభివృద్ధిలో చాలా వెనుకబాటుకు గురైన గ్రామమని, గ్రామానికి అన్నివిధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా కృషిచేస్తానని మరియు ఉపాధి హామీ ద్వారా 100 రోజుల పని ప్రతి కుటుంబానికి కల్పించేలా కృషి చేస్తానని అన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు ఉపాధి హామీ నిధుల ద్వారా మట్టి



రోడ్ల వేయించే బాధ్యత, గ్రామంలో 70 వరకు మరుగుదొడ్ల నిర్మాణం అయిన వాటి బిల్లుల మంజూరు అయ్యేలా కృషిచేస్తా అన్నారు..అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ద్వారా ప్రత్యేక అభివృద్ధి నిధులు రాబట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామము నుండి బ్రహ్మేశ్వర వరకు బిటి రోడ్డు నిర్మాణం కోరకు నిధుల మంజూరుకు ఎమ్మెల్యే సహాయం కోరి బిటి రోడ్డు వేయించే విధంగా కృషి చేస్తా అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే ప్రతి సంక్షేమ పథకం గ్రామ ప్రజలకు అందించే విధంగా, కొత్త గ్రామ పంచాయతీ భవనం మంజూరు అయ్యేలా కృషి చేసి, అంగన్ వాడి భవనం నిర్మించడానికి తను వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్మశాన వాటికకు కల్వర్ట్ నిర్మాణం చేయిస్తా అని హామీ ఇచ్చారు . గ్రామ ప్రజలు ఒకసారి అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని ఆయన అన్నారు.

# యురేనియం ప్రభావిత గ్రామస్థులకు న్యాయం చేస్తాం:జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## కేకే కొట్టాల గ్రామ భూసేకరణకు యూసీ ఐ ఎల్ వారి అవసరం మేరకు చర్యలు

వైయస్సార్ కడప జిల్లా, డిసెంబర్ 11(భారత శక్తి) : యురేనియం ప్రభావిత గ్రామస్థులకు నష్టం జరగకుండా న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యు.సి.ఐ.ఎల్) సమస్యలపై మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, ప్రాజెక్టు అధికారులు, పులివెందుల డివిజన్ రెవెన్యూ అధికారి, కేకే కొట్టాల గ్రామస్థులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన యుసిఐఎల్ ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి కేంద్ర స్థాయిలో పర్యవేక్షణ లో నిర్వహించడం జరుగుతోందన్నారు. యురేనియం ప్రభావిత గ్రామస్థుల సమస్యలు,వారి ప్రతిపాదనలను పరిశీలించి కేంద్రానికి నివేదిస్తామన్నారు. స్థానిక సమస్యలను పరిగణన లోకి తీసుకుని,ప్రాజెక్టు అవసరాలు,నిర్వహణ సామర్థ్యం దృష్ట్యా.. కొత్త టెయిలింగ్ పాండ్ నిర్మాణం చేపట్టడానికి ముందే ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేసి కేకే కొట్టాల గ్రామాన్ని భూసేకరణ చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. దీనిపై పబ్లిక్ నోటిఫికేషన్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందుకు దాదాపు 6 నెలల సమయం పడుతుందన్నారు. అంతేకాకుండా నిర్వహణలో ఉన్న పాత టెయిలింగ్ పాండ్ ఎత్తును పెంచుకునేందుకు కానీ, ఏదైనా మరమ్మతులు చేపట్టేందుకు కానీ ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. దేశాభివృద్ధి, ఉత్పాదక ప్రయోజనాల కోసం.. స్థానికులు తమ సొంత భూములు, సొంత నివాసాలను వదులుకోవడం త్యాగంతో కూడుకున్న విషయమే అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఊరిని కోల్పోతున్న యురేనియం ప్రభావిత గ్రామస్థులకు చట్టపరంగా,న్యాయ పరంగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందన్నారు. కేకే కొట్టాల గ్రామస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం,ఉపాధి అవకాశాలను న్యాయబద్ధంగా కల్పిస్తామన్నారు. గతంలో పరిహారంతో పాటు ఇంకా కొంతమందికి పెండింగ్ లో వున్న ఉద్యోగ కల్పన కూడా త్వరలో క్లియర్ చేయాలని



యూసీఐఎల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా సామాజిక బాధ్యతగా యురేనియం ప్రభావిత గ్రామాల్లో మౌలిక అవసరాలను కల్పించేందుకు ఇంకా మెడికల్ క్యాంపులు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని, ఆ దిశ గా ఆయా గ్రామ ప్రజలకు సహకారం అందించాలని యూసీయల్ యాజమాన్యానికి జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డిఓ చిన్నయ్య, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, యుసీఐఎల్ సూపరింటెండెంట్ ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ నవీన్ కుమార్ రెడ్డి, విజయ్ కుమార్, పీకే నాయర్, తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవాలకు అవకాశమివ్వద్దు ఎన్నికలు జరపాలి


హైదరాబాద్ డిసెంబర్ 11 రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలకు తావివ్వకుండా ప్రతి ఒక్క వార్డు సర్పంచు అభ్యర్థులకు ఎన్నికలు జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ కోరారు.

# రేవంత్ సర్కార్ సరికొత్త రికార్డు..

## బీఆర్ఎస్ హయాం కంటే రెట్టింపు, 2 ఏళ్లలో రూ.1685 కోట్లు పంపిణీ

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి)

తెలంగాణ ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. సీఎం




రిలీఫ్ ఫండ్ పంపిణీకి సంబంధించి అరుదైన మైలురాయిని అందుకుంది. అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో 3.76 లక్షల మంది లబ్ధిదారులకు డబ్బులు అందించించి. ఆపదలో ఉన్నవారికి ఏకంగా రూ. 1,685.79 కోట్ల వైద్య సహాయం అందించింది. ఇక గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నిధులతో పోలిస్తే.. ఇది దాదాపు రెట్టింపు అని అధికార వర్గాలు వెల్లడించాయి.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇటీవలె రెండేళ్లు పూర్తి చేసుకున్న వేళ.. తాజాగా ప్రభుత్వం ముఖ్యమైన రికార్డును అందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త రికార్డును దక్కించుకుంది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి 2025 డిసెంబర్ 6వ తేదీ వరకు గత రెండేళ్లలో మొత్తం 3,76,373 మంది లబ్ధిదారులకు రూ. 1,685.79 కోట్ల వైద్య సహాయాన్ని అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.ఇక గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు.. ఏటా సగటున రూ. 450 కోట్లు మాత్రమే సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ అయ్యేది. కానీ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంవత్సరానికి సగటున రూ. 850 కోట్ల మేర నిధులను వెచ్చించినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ గణాంకాలు పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందో స్పష్టం చేస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఇక సీఎం సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రజలకు వైద్య సహాయం రెండు ప్రధాన విధానాల్లో అందుతోంది. మొదటిది లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) విధానం ద్వారా 27,421 మంది లబ్ధిదారులకు రూ. 533.69 కోట్ల సహాయాన్ని అందించారు. ఈ సహాయం నిమ్స్, ఎంఎన్జే క్యాన్సర్ ఆస్పత్రి వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ఖర్చు భరించేందుకు విడుదల చేశారు. ఈ లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో ఎక్కువగా కేసులు మంజూరు కావడం వల్ల పేదలకు అత్యాధునిక వైద్య సేవలు ఆర్థిక భారం లేకుండా అందుబాటులోకి వచ్చాయని సర్కార్ పేర్కొంది.ఇక రెండో మార్గం.. వివిధ రకాల అనారోగ్యం, రోగాలతో ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న వారు.. అక్కడ ట్రీట్‌మెంట్ ఖర్చులు చెల్లిస్తారు. ఆ తర్వాత సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుని.. తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా అందిస్తున్నారు. ఈ విధానంలో గత 2 ఏళ్లలో రాష్ట్రంలో 3,48,952 మందికి రూ. 1,152.10 కోట్లు అందించినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.మరోవైపు.. సీఎంఆర్ఎఫ్ నిధుల పంపిణీ ప్రక్రియలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటిస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో ఏ ఒక్క దళారీ డబ్బులు దండుకునే అవకాశం లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరిస్తున్నట్లు తెలిపాయి. ఆధార్ ధృవీకరణ తర్వాత.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నేరుగా లబ్ధిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో జారీ చేస్తున్నట్లు వెల్లడించాయి.సాధారణంగా సంవత్సరానికి రూ. 1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్న తెలంగాణ నివాసితులు ఈ పథకానికి అర్హులు అని ప్రభుత్వం తెలిపింది. ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా పనిచేస్తున్న ఈ సీఎం సహాయ నిధి.. అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు గొప్ప భరోసా ఇస్తూ.. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోంది.

# ఆ నగరం చుట్టూ 70 కి.మీ రింగు రోడ్డు..

## మార్చిలో పనులు ప్రారంభం, మారనున్న రూపురేఖలు

వరంగల్, డిసెంబర్ 11 (భారత శక్తి)

వరంగల్ నగరానికి మహర్దశ పట్టనుంది. దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న 70 కిలోమీటర్ల రింగురోడ్డు నిర్మాణానికి వచ్చే ఏడాది మార్చి నాటికి శంకుస్థాపన జరగనుంది. మిగిలిన 41 కిలోమీటర్ల దక్షిణ భాగం నిర్మాణంపై కేంద్రం సానుకూలత చూపడంతో.. ఔఊ-563 విస్తరణతో కలిపి ఈ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.తెలంగాణ రెండో రాజధానిగా రూపుదిద్దుకుంటున్న వరంగల్ పట్టణానికి మహర్దశ పట్టనుంది. నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి త్వరలోనే మోక్షం లభించనుంది. ఇటీవల నర్సంపేటలో జరిగిన ప్రజా విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు కల్లా వరంగల్ రింగురోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. 70 కిలోమీటర్ల మేర ప్రతిపాదించబడిన ఈ రింగురోడ్డులో.. గతంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా కేవలం 29 కిలోమీటర్ల ఉత్తర భాగం మాత్రమే పూర్తి అయింది. మిగిలిన 41 కిలోమీటర్ల దక్షిణ భాగం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇంతకాలం కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించలేదు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం పరిశీలనలోకి తీసుకుంది.ఉమ్మడి రాష్ట్రంలోనే వరంగల్ నగరం చుట్టూ 70 కిలోమీటర్ల రింగురోడ్డు ప్రతిపాదన వచ్చింది. ఆ సమయంలో జిల్లాల్లో అవుటర్ రింగురోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు లేవు. నేషనల్ హైవే-163 రహదారి ములుగు-ఏటూరునాగారం మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నానికి వెళ్లాల్సి రావడంతో వరంగల్ నగరం మధ్యలో ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు బైపాస్ నిర్మాణం




ఆలోచన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవుటర్ రింగురోడ్డు ఆలోచనను కేంద్రానికి చెప్పగా.. ఎన్‌హెచ్-163 రెండు రాష్ట్రాల మధ్య కీలకమైన రోడ్డు కావడంతో మొత్తం ఔటర్‌ను చేపట్టలేమని కేంద్రం తెలిపింది. కేవలం బైపాస్ అవసరమైన భాగం వరకు మాత్రమే అంటే 29 కిలోమీటర్ల అవుటర్ రోడ్ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించి పూర్తి చేసింది. జగిత్యాల మీదుగా ఖమ్మం వైపు వెళ్లే ఔఊ-563 రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ రహదారి కూడా వరంగల్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నందున భవిష్యత్తులో మళ్లీ ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో మళ్లీ బైపాస్ ఆలోచన చేయాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మిగిలి ఉన్న అవుటర్ దక్షిణ భాగం నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్రాన్ని కోరింది. దీంతో ఔఊ-563 నాలుగు లైన్ల విస్తరణ పనులతో కలుపుకొని బైపాస్ స్థానంలో రింగురోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. మిగిలిన 41 కిలోమీటర్లలో సుమారు 33 కిలోమీటర్ల అవుటర్ భాగం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ 70 కిలోమీటర్ల రింగురోడ్డు పూర్తి అయితే వరంగల్ పట్టణం మరింత అభివృద్ధి చెందనుంది.

# తిరుమలలో ప్రయోగాత్మకంగా రిసైకిల్ మిషన్ల ఏర్పాటుపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల డిసెంబర్ 11 (భారత శక్తి)

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రిసైకిల్ మిషన్ల ఏర్పాటుపై గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.సెప్టెంబర్ నెలలో ప్రయోగాత్మకంగా తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-5 (ఖంఅ-5) లో ఏర్పాటు చేసిన రెక్లెయిమ్ డిపాజిట్ రీఫండ్ మిషన్లకు విశేష స్పందన రావడంతో తిరుమలలో ఈ మిషన్లను మరి కొన్నింటిని పరిశీలనాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.తిరుమలలో టెట్రాపాక్ మరియు టిన్ లలో పానీయాలను స్వీకరించిన అనంతరం భక్తులు ఎక్కడంటే అక్కడ పడేయకుండా ఈ డిపాజిట్ రీఫండ్ మెషిన్ల లో వేస్తే తిరుమలలో పరిశుభ్రత మరింత మెరుగుపడేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ విషయంపై తిరుమలలోని వ్యాపారులు, టెట్రా ప్యాక్ డీలర్లు కూడా తోటి వారిలో అవగాహన కల్పించాలని కోరారు.స్వచ్ఛ తిరుమలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడంలో భాగంగా ఒక ఉద్యమంలా రెక్లైమ్ రీసైకిల్ మెషిన్లపై భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించి తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మరిన్ని మెషిన్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఈవో ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎఫ్ఓ ఫణి కుమార్ నాయుడు, డిప్యూటీ ఈవోలు సోమన్నారాయణ, వేంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, రెక్లైమ్ రీసైకిల్ సంస్థ ప్రతినిధులు కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# చెప్పేవి శ్రీరంగనీతులు..చేసేవి దొంగ పనులు అన్నట్లుంది కూటమి ప్రభుత్వం తీరు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలకు పొంతనే లేదు. : షర్మిల

విజయవాడ డిసెంబర్ 11, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలకు పొంతనే లేదని ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. రూ.15651కోట్ల మేర ఛార్జీల వడ్డనకు నియంత్రణ మండలి సర్వం సిద్ధం చేస్తుంటే, – బిల్లుల పెంపుపై ప్రజాభిప్రాయానికి ప్రకటన కూడా ఇచ్చేస్తే, ఇంకా చార్జీలు భారం పడదని చెప్పే చంద్రబాబు మాటలు పాత చింతకాయ పచ్చడితో సమానమని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని ఇప్పటికీ అనడం తీవ్ర హాస్యాస్పదం.అధికారం చేపట్టిన ఏడాదిన్నరలోనే జనాలకు సర్దుబాటు పేరుతో గుండెపోటు తెప్పించారు. రూ.15 వేల కోట్ల మేర ట్రూ అప్ బిల్లులతో జనాల జేబులకు చిల్లులు పెట్టారు. ఇప్పుడు మరో రూ.15 వేల కోట్లకు టైం ఆఫ్ ది డే పేరుతో దోచేందుకు కసరత్తు చేస్తున్నారు. నమ్మి ఓటేసిన పాపానికి రాష్ట్ర ప్రజలకు ఏడాదికో హైటెన్షన్ షాక్ పెడుతున్నారు. లోటు పేరుతో జనాలను బాదడం అత్యంత దారుణం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. నిజంగా కరెంట్ ఛార్జీలు పెంచొద్దని చిత్తశుద్ధి మీకుంటే, – ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలబడే తత్వమే మీదైతే, ఏపీ ఈఆర్సి రూపొందించిన ప్రతిపాదనలపై తక్షణం స్పందించండి. రూ. 15 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తున్నట్లు అధికారిక ప్రకటన చేయండి. ఇప్పటి వరకు ప్రజలపై మోపిన మరో రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను సైతం రద్దు చేయండని అన్నారు.

# హైదరాబాద్ గ్లోబల్ సినీ హబ్.. రేవంత్ తో చిరంజీవి ప్లాన్!

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి)

హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో రెండు రోజులునిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబన్ సమ్మిట్ ముగిసింది. రెండో రోజు అనేక మంది సినీ ప్రముఖులు హాజరయ్యారు. భారీగా పెట్టుబడులకు వ్యాపారులు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఇక ఈ సమ్మిట్‌కు సినిమా ఇండస్ట్రీ ప్రతినిధిగా వచ్చానని చెప్పిన చిరంజీవి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విజన్‌ను ప్రశంసించారు. ఇండస్ట్రీ విజన్ చాలా బాగుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సల్మాన్ ఖాన్, అజయ్ దేవగన్ వంటి ప్రముఖులు ఆధునిక స్టూడియోలను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.గ్లోబల్ సమ్మిట్ వేదికపై అన్ని భాషల సినిమాలకు స్థానమివ్వాలని, హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో ఒక సినిమా హబ్‌గా తీర్చిదిద్దాలని రేవంత్ రెడ్డి సంకల్పం ప్రతిష్ఠాత్మకమైందని చిరంజీవి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కూడా వినోద రంగ అభివృద్ధికి వేవ్స్ కార్యక్రమం ద్వారా సహకారం అందిస్తున్నారు.సినీరంగానికి సంబంధించిన 24 శాఖలకు సంబంధించిన నైపుణ్య అభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణ సంస్థ అవసరమని చిరంజీవి సూచించారు. దీనితో తెలంగాణ వినోద రంగంలో యువ ప్రతిభలకు మంచి అవకాశాలు లభిస్తాయని విశ్వసిస్తున్నారు. హైదరాబాద్ అందుబాటులో ఉన్న వనరులు, ట్రాన్స్‌పోర్ట్, మల్టీ లాంగ్వేజ్ కారణంగా గ్లోబల్ సినిమాల షూటింగ్‌కి అనువైన వాతావరణమని మెగాస్టార్ అభిప్రాయపడ్డారు.ఈ విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సినీ పరిశ్రమపై గౌరవం, వారి విజయం ప్రశంసలను మెగా స్టార్ చిరంజీవి ముఖ్యంగా ప్రచారం చేశారు.రెండు రోజుల కార్యక్రమం సక్సెస్ అయింది. మొదటి రోజు 3 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, రెండో రోజు మరో రూ.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. ఈమేరకు దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. మొత్తంగా సీఎం రేవంత్ తన 2047 విజన్ డాక్యుమెంట్‌తో పెట్టుబడిదారులను ఆకట్టుకున్నారు.

కోర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా..

తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమిట్‌లో అంచనా వేసిన రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటులో రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు స్పష్టమైన ప్రణాళికలు ప్రతిపాదించబడ్డాయి. ఈ అభివృద్ధి వ్యూహం 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.డాక్యుమెంట్‌లో రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి (కోర్: నగర పరిసరాలు, ప్యూర్: పెద్ద పట్టణాలు, రేర్: గ్రామీణ వ్యవసాయ ప్రాంతాలు) ప్రతి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఈ విధానం పేదరిక నిర్మూలన, పెట్టుబడుల ఆకర్షణ, పాలనా పారదర్శకత వంటి అంశాలను కేంద్రీకరించి సమగ్ర సాంకేతిక, సామాజిక ప్రగతిని లక్ష్యంగా పెట్టుకున్నది.తయారీకి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లక్షల మందికి పైగా ప్రజలను సలహా కోసం అనుమతించి, అభిప్రాయాలు సేకరించింది. ప్రజల భాగస్వామ్యం కారణంగా ఈ డాక్యుమెంట్ నమ్మదగిన, సమర్థవంతమైన మార్గదర్శకంగా నిలిచి, తెలంగాణ అభివృద్ధి పథం అంతర్జాతీయ పాఠ్యాంశంగా మారడం సాధ్యమవుతుందన్న విశ్వాసం ఉంది.సమిట్‌లో పాల్గొన్న అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు, పారిశ్రామిక వేత్తలు తెలంగాణ




మోడల్‌ను విశిష్టతగా అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, పెట్టుబడుల అందుబాటు వద్ధి, సాంకేతిక పరిజ్ఞాన వాతావరణం ప్రతిష్ఠాత్మకంగా పొందుపరిచారు. భారత్ ఫ్యూచర్ సిటీ, డ్రైపోర్ట్, బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్లు వంటి ఆధునిక మౌలిక నిర్మాణాలు రాష్ట్ర ప్రగతికి కీలక మార్గదర్శకాలుగా మారతాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రాజెక్టులు పెట్టుబడులు, పరిశోధన, ప్రగతి వాతావరణాల్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.వివిధ వర్గాల సంక్షేమం, ఆరోగ్యం, విద్య, నైపుణ్య అభివృద్ధి, జీవనోపాధి విషయాలను ప్రధాన ప్రముఖ అంశాలుగా ఉంచి సమగ్ర సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల శుభ్రత, టూరిజం అభివృద్ధి వంటి రంగాలు కూడా దీర్ఘకాలిత లక్ష్యాలుగా పేర్కొన్నాయి.ప్రభుత్వం పలు కంపెనీలతో పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చి, వ్యాపార వాతావరణాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. తెలంగాణలో అభివృద్ధితో ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి అవకాశాలు అందాలని స్పష్టంగా భావిస్తోంది. మొత్తంగా రేవంత్ విజన్ డాక్యుమెంట్ జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, వ్యాపారుల ప్రశంసలు అందుకోవడంతోపాటు రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను రాబట్టింది.


# పలు ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 11 (భారత శక్తి):నిర్మల్ జిల్లాలో గురువారం జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా, పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పెంబి మండలంలోని ధూమధారి, గుమ్మేణ గ్రామాల్లో, ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి, తర్లపాడ్, గోసంపల్లి, దిలావర్ పూర్ గ్రామాలతో పాటుగా, మమడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు తనిఖీ చేశారు. ఎన్నికల సరళిని పరిశీలించి, పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్:జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 11 (భారత శక్తి): నిర్మల్ జిల్లా పరిధిలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తిగా ప్రశాంత వాతావరణంలో సాగిందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల వెల్లడించారు.ఎన్నికల పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు.ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో అదనపు పోలీసు బలగాలను మోహరించామని, లెక్కింపు కేంద్రాల పరిసరాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవాల ర్యాలీలకు అనుమతి లేదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. నియమావళి ఉల్లంఘనకు ఎవరూ ప్రయత్నించకూడదని, ప్రజలు, అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



# లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కడప నందు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలకు ప్రకటన"



కడప, డిసెంబర్ 11(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కడప నందు జూనియర్ అసిస్టెంట్ / ఆఫీస్ అసిస్టెంట్ పోస్ట్ -1, డేటా ఎంట్రీ ఆపరేటర్ కం రిసెప్షన్ పోస్ట్ -1, ఆఫీస్ సబార్డినేట్ / ప్యూన్ పోస్టు -1 ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుటకు నోటిఫికేషన్ జారీ చేశారు. సంబంధిత ఔట్సోర్సింగ్ ఉద్యోగాల వివరములకై సంప్రదించవలసిందిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప నోటీసు బోర్డ్ నందు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కడప నోటీసు బోర్డు నందు గమనించగలరు. దరఖాస్తులకు చివరి తేదీ 22-12-2025 అని తెలిపారు.

# వంతెన మరమ్మత్తు,వాహనాలు మళ్లింపు

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11 (భారత శక్తి) : ములుగు జిల్లా మల్లం పల్లి మండల కేంద్రం పరిధిలోని 163వ జాతీయ రహదారిలో నేడు (శుక్రవారం), రేపు (శనివారం) ఉదయం 9.30 గంటల 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4.30 గంటల వరకు వంతెన మరమ్మత్తు కొరకు ట్రక్స్, లారీలు, బస్సులు వ్యాన్లు, వాహనాలను గూడెంపాడు వయా పరకాల రేగొండ గాంధీనగర్ జంగాలపల్లి ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చేయడం జరుగుతుందని, వాహనదారులు సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లంపల్లి కెనాల్ బ్రిడ్జ్ వద్ద, పీతాలతో పాటు అబట్‌మెంట్ ఎ 1 మరియు ఎ 2 పూర్తయ్యాయి. ప్రీకాస్ట్ గ్రిడర్ల ఏర్పాటును చేపట్టుటకు, గిర్డర్ లాంచింగ్‌లో భారీ క్రేన్‌లు మరియు పెద్ద రవాణా వాహనాలను మోహరించడంతో పాటు కాస్టింగ్ యార్డ్ నుండి బ్రిడ్జ్ సైట్‌కు గిర్డర్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని గూడెప్పాడ్ నుండి పర్కల్, రేగొండ, గాంధీనగర్, జంగాలపల్లి మీదుగా ట్రక్కులు, లారీలు, బస్సులు, వ్యాన్‌లతో సహా ట్రాఫిక్‌ను ఈ సమయాల్లో వాహనాలు మళ్లించేలా ఏర్పాటు చేసి పనులు



సజావుగా జరిగేలా చూడాలని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# మెస్సీ టూర్ కు ప్రభుత్వానికి సంబంధం లేదు

హైదరాబాద్, డిసెంబర్ 11

ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు.అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు.'మెస్సీ గోట్ ఇండియా టూర్'లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు.

# డిజిటల్ మార్కెటింగ్ నందు ఉచిత శిక్షణ

కడప, డిసెంబర్ 11(భారత శక్తి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్, మోడల్ కెరీర్ సెంటర్, కలెక్టరేట్, కడప నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్ సి) నిరుద్యోగ యువతి యువకులకు ఈ క్రింద తెలిపిన కోర్సుల నందు ఉచిత మధ్యాహ్న భోజనం తో శిక్షణ అందించేందుకు ఆసక్తి కలిగి న వారినుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్,అసిస్టెంట్ డైరెక్టర్,ఎం. రాకేష్ తెలిపారు.

కోర్సుల వివరములు:1.డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ అర్హతలు:10th మరియు ఆపైన చదువుకున్న వారు వయస్సు: 18 సం. నుండి 40 సం. వరకు

శిక్షణకు కావలసిన సామగ్రి ఉచితంగా అందించబడును.

పై కోర్సులో సుమారు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆ రంగాలలో ఉపాధి కల్పించబడును.

ఆసక్తి కల వారు డిసెంబర్ 13 వ తేదీ లోపు మోడల్ కెరీర్ సెంటర్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, కలెక్టరేట్, కడప నందుగల నాక్ శిక్షణ కేంద్రాలను సందర్శించవచ్చును. మరింత సమాచారం కొరకు 9985142155/9618177697 యందు సంప్రదించగలరని తెలిపారు.

# జిల్లాలో యధావిధిగా విమానయాన సేవలు

## కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోద్దార్

**ఫ్లైట్ (ట్రైనింగ్ స్కూల్ (ఎఫ్టి ఒ) త్వరలో ప్రారంభం కానుంది. ఇది కడప యువతకు భవిష్యత్ పైలట్లుగా మారడానికి అవకాశం కల్పిస్తుంది.**

కడప, డిసెంబర్ 11(భారత శక్తి) : జిల్లాలో ఎప్పటిలాగే యధావిధిగా విమానయాన సేవలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించనున్నామని.. కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోద్దార్ తెలిపారు.

గురువారం మధ్యాహ్నం కడప మిమానాశ్రయంలో ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దార్.. ఇటీవల ఇండిగో విమాన సేవల సంక్షోభం అనంతరం భవిష్యత్తులో కడప విమానాశ్రయం అందించే మెరుగైన సేవలను ప్రెస్ మీట్ ద్వారా వివరించారు.

1) 2025 డిసెంబర్ మొదటి వారంలో జరిగిన ఇండిగో (ఇండిగో) సంక్షోభం తరువాత, ప్రస్తుతం కడప విమానాశ్రయం సాధారణంగా పనిచేస్తోంది. అన్ని విమానాలు నిర్ణీత సమయానికి నడుస్తున్నాయి.

2) సగటున ప్రతిరోజూ 200 మంది ప్రయాణికులు కడప విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తున్నారు.

3) 04/12/2025న విమాన రాకపోకలలో 2 గంటలకు పైగా ఆలస్యం జరిగింది. అయితే, డిసెంబర్ 5వ తేదీ మినహా కడప విమానాశ్రయంలో ఎటువంటి విమాన రద్దు (కాన్సలేషన్) జరగలేదు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఇండిగో సంస్థ ముందుగానే సమాచారం అందించింది. ప్రస్తుతం కడప విమానాశ్రయంలో ప్రయాణికులకు సంబంధించి డెలివరీ చేయాల్సిన బ్యాగేజీ ఏదీ పెండింగ్లో లేదు.

4) విమానాలు ఆలస్యమైన సమయంలో, అక్కడ చిక్కుకుపోయిన ప్రయాణికుల కోసం %ూాా×% (ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆ ఇండియా) మరియు ఇండిగో ఎయిర్లైన్స్ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాయి. సెక్యూరిటీ హెరీల్డ్ ఏరియా (షా)లో తగినన్ని సీట్లు, సరిపడా తాగునీరు మరియు స్నాక్ బార్ అవుట్లెట్ స్నాక్స్ అందుబాటులో ఉంచారు. వాష్రూమ్లను శుభ్రం చేయడానికి అవసరమైన పారిశుధ్య సిబ్బందిని మోహరించారు..

5) ప్రస్తుతం ఇండిగో హైదరాబాద్కు ప్రతిరోజూ మరియు చెన్నై/ విజయవాడకు రోజు మార్చి రోజు (ఆల్టర్నేట్ డేస్) విమానాలను నడుపుతోంది.

6) హైదరాబాద్ నుండి విమానం ప్రతిరోజూ మధ్యాహ్నం 12:40 గంటలకు వచ్చి, అక్కడి నుండి చెన్నై /విజయవాడకు (రోజు మార్చి రోజు) వెళ్తుంది.

7) హైదరాబాద్ కు వెళ్లే విమానం ప్రతిరోజూ సాయంత్రం 3:30 గంటలకు ఉంటుంది.



8) హైదరాబాద్ మరియు చెన్నై విమానాలు ప్రయాణికులకు గల్ఫ్ దేశాలకు మరియు ఇతర ప్రాంతాలకు వెళ్లే కనెక్టింగ్ విమానాలను అందుకోవడానికి సహాయపడతాయి.

9) ప్రయాణికుల సౌకర్యార్థం స్నాక్స్ బార్ మరియు కార్ రెంటల్ సర్వీసెస్ వంటి కొత్త సదుపాయాలు విమానాశ్రయంలో ప్రవేశపెట్టబడ్డాయి.

10) త్వరలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం కానుంది.

11) ప్రయాణికుల సహాయార్థం 'మేఐ హెల్ప్ యు' డెస్క్ కూడా త్వరలో ప్రారంభం కానుంది.

12) కొత్త బేబీ కేర్ (శిశు సంరక్షణ) సేవ కూడా త్వరలో ప్రారంభం కాబోతోంది.

13) సెక్యూరిటీ హెల్డ్ ఏరియా (షా)లో కొత్త స్నాక్ బార్ సౌకర్యం త్వరలో ప్రారంభం కానుంది.

14) హైదరాబాద్ నుండి కడపకు మరో రోజువారీ విమానం మరియు విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరులకు రోజువారీ విమానాలు నడపడం వంటి కొత్త మార్గాలను జోడించాలని ఏ ఏ ఐ ఇండిగో మరియు ఇతర విమానయాన సంస్థలను కోరింది.

15) కడప విమానాశ్రయంలో 2023 నుండి నైట్ ల్యాండింగ్ (రాత్రి వేళ విమానాలు దిగే) సౌకర్యం అందుబాటులో ఉంది.

16) ఎయిర్ బస్ ఎ320 వంటి పెద్ద విమానాలకు అనుకూలంగా ఉండేలా 2022లో ధన్వాను 2515 మీటర్లకు విస్తరించారు.

17) కొత్త టెర్మినల్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి, ఇది మార్చి- ఏప్రిల్ 2020 నాటికి పూర్తవుతుందని అంచనా. దీని పీక్ అవర్ సామర్థ్యం 700 మంది ప్రయాణికులు (350-350) మరియు వార్షిక సామర్థ్యం 1.01 మిలియన్ ప్రయాణికులు , ప్రస్తుతం 60% భవన నిర్మాణం పూర్తయింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.260 కోట్లు.

18) ఈ కొత్త భవనం మొత్తం 16,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో సెంట్రలైజ్డ్ ఏసీ, 24 చెక్-ఇన్ కౌంటర్లు, 2 కన్వేయర్ బెల్టు 5 బోర్డింగ్ గేట్లు, 3 ఏరోబ్రిడ్జు, 2 ఎస్కలేటర్లు, లిఫ్టు, రెస్టారెంట్, స్నాక్ బార్, రిటైల్ అవుట్ లెట్లు, చైల్డ్ కేర్ రూమ్ మొదలైన అన్ని ఆధునిక సౌకర్యాలు ఉంటాయి.

19) కొత్త టెర్మినల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కడప విమానాశ్రయం ఒకేసారి 7. ఎయిర్బస్ ఎ320 విమానాలను హ్యాండిల్ చేయగలదు.

20) కొత్త కార్ పార్కింగ్ ప్రాంతంలో 375 కార్లు మరియు 100 స్టాఫ్ కార్లను పార్క్ చేసే సామర్థ్యం ఉంటుంది.

21) కొత్త టెర్మినలు ఎక్కువ మానవ వనరులు అవసరమవుతాయి, తద్వారా స్థానిక ప్రజలకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

22) కడప విమానాశ్రయం నుండి కడప నగరానికి బస్సు సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని స్థానిక ఎంపీని మరియు జిల్లా యంత్రాంగాన్ని ఎ ఎ ఐ కోరింది.

23) ఎ పి ఎస్ ఆర్ టి సి బస్సుల కోసం విమానాశ్రయంలో బస్ స్టాప్ ఇప్పటికే ఏర్పాటు చేయబడింది.

24) కొత్త ఏటీసీ (ఏటీసీ) టవర్ మరియు కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటు విషయం కూడా ఎ ఎ ఐ మేనేజ్ మెంట్ పరిశీలనలో ఉంది.

25) ఫ్లైట్ (ట్రైనింగ్ స్కూల్ (ఎఫ్టి ఒ) త్వరలో ప్రారంభం కానుంది. ఇది కడప యువతకు భవిష్యత్ పైలట్లుగా మారడానికి అవకాశం కల్పిస్తుంది.

26) స్థానిక సంస్థలు లేదా వ్యాపారుల నుండి డిమాండ్ ఉంటే, కడప విమానాశ్రయం నుండి కార్గో (సరుకు రవాణా) కార్యకలాపాలను ప్రారంభించాలని ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా యోచిస్తోందని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తోపాటు ఆపరేషన్స్ మేనేజర్ దామోదర్ రెడ్డి, ఎస్పీ ఏఎఫ్ కె.ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.



# టూత్‌బ్రష్‌ల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయాలివే..!

**అందమైన దంతాల వరుస కావాలన్నా.. దంతాలు మిల మిలలాడుతూ మెరవాలన్నా.. ఎవరైనా ఏం చేయాలి? దంతాలను సరిగ్గా తోమాలి. శుభ్రం చేసుకోవాలి. అంతే..! కానీ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అధిక శాతం మంది దంతాలను సరిగ్గా తోమడం లేదట.**

అందమైన దంతాల వరుస కావాలన్నా.. దంతాలు మిల మిలలాడుతూ మెరవాలన్నా.. ఎవరైనా ఏం చేయాలి? దంతాలను సరిగ్గా తోమాలి. శుభ్రం చేసుకోవాలి. అంతే..! కానీ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అధిక శాతం మంది దంతాలను సరిగ్గా తోమడం లేదట. నిత్యం రెండు సార్లు దంతధావనం చేయాలని డెంటిస్టులు చెబుతున్నా, కనీసం ఒక్కసారి తోమినప్పుడు కూడా దంతాలను ఎవరూ సరిగ్గా శుభ్రం చేసుకోవడం లేదట. దీని వల్ల అనేక దంత సమస్యల బారిన పడాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఈ క్రమంలో దంత సంరక్షణ కోసం ఉపయోగించే టూత్‌బ్రష్ పట్ల కూడా కొన్ని విషయాలు తప్పనిసరిగా తెలుసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సాఫ్ట్ బ్రిజిల్స్ ఉంటేనే..

సాఫ్ట్ బ్రిజిల్స్ ఉన్న టూత్ బ్రష్‌లను మాత్రమే వాడాలి. ఎందుకంటే హార్డ్ బ్రిజిల్స్ దంతాలకు, చిగుళ్లకు హాని కలిగిస్తాయి. కాబట్టి సాఫ్ట్, అల్ట్రా సాఫ్ట్ అని రాసి ఉన్న టూత్‌బ్రష్‌లను మాత్రమే వాడాలి. కనీసం 3, 4 నెలలకోసారి అయినా టూత్ బ్రష్‌లను మార్చాలి. లేదంటే వాటిలో బాక్టీరియా పెరిగిపోయి అవి నేరుగా మన జీర్ణాశయంలోకి వెళ్లి ఇతర అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. అయితే ఫ్లూ జ్వరం, దగ్గు, జలుబు వంటివి వచ్చినప్పుడు కూడా టూత్‌బ్రష్‌లను మార్చాలి. ఎందుకంటే అవి తగ్గాక కూడా బాక్టీరియా ఆ బ్రష్‌లలో అలాగే ఉంటుంది. దీంతో మళ్లీ మనకు ఆ అనారోగ్యాలు కలిగేందుకు అవకాశం ఉంటుంది. చాలా మందికి టూత్‌బ్రష్‌లను బాత్‌రూంలలో పెట్టడం అలవాటు. అయితే ఆ అలవాటును ఇప్పుడైనా మానండి. ఎందుకంటే బాత్‌రూంలలో ఉండే హానికరమైన బాక్టీరియా మన టూత్‌బ్రష్‌ల పైకి సులభంగా చేరుతుంది. దీని వల్ల కూడా మన ఆరోగ్యం చెడిపోయేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి వాష్‌రూంలలో టూత్‌బ్రష్‌లను ఉంచకూడదు.

ఇతరుల టూత్ బ్రష్‌లతో కలిపి..

ఒకే బాక్స్‌లో అన్ని టూత్‌బ్రష్‌లను కూడా ఉంచకూడదు. లేదంటే ఇతరుల బ్రష్‌లలో ఉండే బాక్టీరియా మన బ్రష్‌లపై కూడా చేరేందుకు అవకాశం ఉంటుంది. మన నోట్లో ఎల్లప్పుడూ 200 నుంచి 500 రకాల బాక్టీరియా నివాసం ఉంటుందట. దీన్ని నివారించాలంటే రోజుకి కనీసం 2 సార్లు, ప్రతి సారి 2 నిమిషాల పాటు దంతాలను తోముకోవాలట. అలా తోముకోకపోతే బాక్టీరియా మొత్తం అలాగే ఉండి నోటి దుర్వాసన, దంత క్షయం వంటి సమస్యలు వస్తాయి. టూత్‌బ్రష్‌పై ఎలాంటి క్యాప్ ఉంచకూడదు. దీని వల్ల బ్రిజిల్స్‌పై బాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది మన దంతాలకు సమస్యలను కలగజేస్తుంది. ఇక ఓ సంస్థ చేపట్టిన సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజల్లో అధిక శాతం మంది నిత్యం 45 నుంచి 70 సెకండ్లలోపే దంతాలను తోమడం ముగించేస్తారని తేలింది. కానీ తప్పనిసరిగా 2 నిమిషాల పాటు దంతాలను తోమాల్సిందేనని దంత వైద్యులు చెబుతున్నారు.

ఆ రంగుల్లో ఉండే వాటినే..

ఇక పురుషుల కంటే మహిళలే ఎక్కువ సేపు దంతాలను శుభ్రం చేసుకుంటారని కూడా సర్వేలు చెబుతున్నాయి. అలాగే 1959లో అమెరికాలో మొదటిసారిగా ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్‌ను తయారు చేశారు. 1850వ సంవత్సరం వరకు టూత్‌పౌడర్‌నే ఎక్కువగా ఉపయోగించేవారు. టూత్‌పేస్ట్‌లు అప్పుడు లేవు. కాగా కోల్గేట్ సంస్థ 1873లో తొలిసారిగా టూత్‌పేస్ట్‌ను తయారు చేసింది. అప్పుడు ఆ సంస్థ దాన్ని జార్‌లలో అందించేది. అనంతరం 1890లో ఇప్పుడున్న మాదిరిగా అప్పుడు ట్యూబ్‌లు వచ్చాయి. అప్పటి నుంచి ట్యూబ్‌లలోనే టూత్‌పేస్ట్‌ను అందిస్తున్నారు. ఇక 1945 వరకు టూత్‌పేస్ట్‌లలో సబ్బు ప్రధాన పదార్థంగా ఉండేది. సోడియం లారైల్ సల్ఫేట్ అనే రసాయనాన్ని అప్పుడు సబ్బుకు బదులుగా టూత్‌పేస్ట్‌లలో వాడడం మొదలుపెట్టారు. 1956లో ఫ్లోరైడ్‌తో కూడిన మొదటి టూత్‌పేస్ట్‌ను తయారు చేశారు. ఇక బ్లూ, రెడ్ రంగుల్లో ఉండే టూత్‌బ్రష్‌లను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి.

# వృద్ధాప్యం ముందే పలకరించొద్దంటే..



ప్రతి మనిషికీ నిండు నూరేళ్లు బతకాలనే కోరిక ఉంటుంది. ఆహారపు అలవాట్లను కొద్దిగా సరిచేసుకుంటే ఆ కోరిక తప్పకుండా నెరవేరుతుంది! ఎలాగో తెలుసా? కొన్ని రకాల ఆహార పదార్థాలు దేహంలో జీవక్రియలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. దీంతో వయసు పైబడక ముందే వృద్ధాప్యం పలకరిస్తున్నది. ఇన్‌ఫ్లమేషన్, కణాలలోని కొలాజన్ దెబ్బతినడం, ఆక్సిడేషన్ పెరగడం, ఆరోగ్యవంతమైన జీవక్రియల్లో మార్పులు కలుగజేసే ఆరు రకాల ఆహార పదార్థాలను తరచుగా తీసుకోవడం.. ఇవన్నీ ముదిమిని ముందుకు తెస్తాయనిని నిపుణులు చెబుతున్నారు. అందాన్ని పెంచుకుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ, యవ్వనాన్ని ఇంకొంచెం ఎక్కువకాలం పెంచుకోవాలంటే తప్పకుండా వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

పంచదార పానియాలు : పంచదార కలిపి తయారు చేసిన పళ్ల రసాలు తాగితే రక్తంలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పెరుగుతాయి. దీనివల్ల చర్మ కణజాలంలో ఉండే కొలాజన్ బలహీనపడుతుంది. అందువల్ల చర్మం ముడతలుపడి ముసలితనాన్ని ముందే తెస్తుంది.

వేపుళ్లు : బాగా వేయించిన ఆహారం తింటే.. ట్రాన్స్ ఫ్యాట్ వల్ల చర్మం ఆరోగ్యాన్ని కోల్పోతుంది. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతుంది.

మద్యం : ఆల్కహాల్‌ని అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలో నీరు తగ్గి పొడిబారిపోతుంది. ఆల్కహాల్ ప్రభావంతో కొలాజన్ ఉత్పత్తి తగ్గుతుంది. లివర్ పనితీరుపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణాల వల్ల వృద్ధాప్యం తొందరగా వస్తుంది.

ప్యాక్ చేసిన ఆహారం: రంగు, రుచి పెంచేందుకు, నిల్వ చేసేందుకు, ఆకట్టుకునే రంగు కోసం ప్యాక్ చేసిన ఆహారంలో కొన్ని రసాయనాలను ఉపయోగిస్తారు. అలాగే వీటిలో కార్బొహైడ్రేట్‌లు, ట్రాన్స్‌ఫ్యాట్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుదలకు, ఆక్సిడేషన్ చర్యలు పెరగడానికి కారణమవుతాయి.

ప్రాసెస్ చేసిన మాంసం: మాంసాన్ని ప్రాసెస్ చేసేందుకు నైట్రేట్స్, సోడియం, నిల్వ చేసేందుకు రసాయనాలు ఉపయోగిస్తారు. ఇవి కూడా ఇన్‌ఫ్లమేషన్, ఆక్సిడేషన్‌ను పెంచుతాయి.

ప్రాసెస్ చేసిన పిండి పదార్థాలు: ప్రాసెస్ చేసిన ధాన్యాలతో చేసిన ఆహారం తినడం వల్ల రక్తంలోకి ఒక్కసారిగా చక్కెరలు వచ్చి చేరతాయి. ఇవి కూడా కొలాజన్‌ని నష్టపరుస్తాయి.



# సీఆర్పీ పెరిగితే బ్లడ్ ఇన్‌ఫెక్షనా?

పిల్లల పెంపకం


మా బాబు వయసు రెండేండ్లు. గతేడాది మూడు నాలుగు సార్లు జ్వరం వచ్చింది. జ్వరం వచ్చినప్పుడల్లా మూడునాలుగు రోజులు ఉండేది. రక్త పరీక్షలు చేయిస్తే.. బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉందన్నారు. రిపోర్ట్స్‌లో సీఆర్పీ ఎక్కువగా ఉందని చెప్పారు. వైద్యులు యాంటి బయాటిక్స్ ఇచ్చిన తర్వాత బాబు కోలుకున్నాడు. ఇలా మళ్లీ మళ్లీ బ్లడ్ ఇన్‌ఫెక్షన్ రావడం ప్రమాదకరమా? సీఆర్పీ పెరిగితే బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టా?

మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ బాబు ఏడాదిలో మూడు, నాలుగు సార్లు ఇన్‌ఫెక్షన్‌కు గురైనట్టుగా కనిపిస్తున్నది. మనకు ఏదైనా ఇన్‌ఫెక్షన్ తెలెత్తినప్పుడు శరీరం రియాక్ట్ కావడం వల్ల పెరిగే ప్రొటీనే సీఆర్పీ (సీ రియాక్టివ్ ప్రొటీన్). సాధారణంగా బ్యాక్టీరియా వల్ల ఇన్‌ఫెక్షన్ కలిగినప్పుడు సీఆర్పీ పెరుగుతుంది. కొన్నిసార్లు వైరల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా పెరగవచ్చు. ఇతర కారణాల వల్ల కూడా సీఆర్పీ పెరుగుతుంది. ఉదాహరణకు దెబ్బ తగలడం, ఆపరేషన్ తర్వాత బాడీలో ఏదైనా ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడినా ఈ పరిస్థితి వస్తుంది. ఇది బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ఉండొచ్చన్న అనుమానాన్ని వ్యక్తపరుస్తుంది. అంతేకాని సీఆర్పీ పెరిగిన ప్రతిసారీ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ఉందనుకోవద్దు. చాలాసార్లు రోగులకు, పేరెంట్స్‌కు అర్థం కావడానికి సీఆర్పీ అధికంగా ఉంటే బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉందేమో అని అనుమానం వ్యక్తం చేస్తారు. రక్తంలో బ్యాక్టీరియా ఉన్నప్పుడే దాన్ని ఇన్‌ఫెక్షన్‌గా పరిగణించాలి. శరీరంలో వేరే భాగాల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నా.. సీఆర్పీలో పెరుగుదల కనిపిస్తుంది. ఉదాహరణకు త్రోట్ ఇన్‌ఫెక్షన్, యూరిన్ ఇన్‌ఫెక్షన్, న్యుమోనియా ఉన్నా సీఆర్పీ పెరుగుతుంది. సీఆర్పీ ఎక్కువగా ఉన్నంత మాత్రాన కంగారు పడాల్సిన పనిలేదు. బిడ్డ లక్షణాలు, బ్లడ్ టెస్ట్, యూరిన్ టెస్ట్, ఛాతీ ఎక్స్ రే ఇవన్నీ గమనించి, పరీక్షల్లో ఉన్న మార్పులను పరిగణించి.. ఇన్‌ఫెక్షన్‌ను నిర్ధారించాల్సి ఉంటుంది. వైద్యులు దానికి తగ్గ యాంటి బయాటిక్స్ సూచిస్తారు.

ఒకటి నుంచి ఐదేండ్లలోపు పిల్లల్లో సంవత్సరానికి పది పన్నెండు ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. పిల్లల ఇమ్యూనిటీ పెరిగే క్రమంలో సాధారణంగా జలుబు, దగ్గు, ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వీటిలో మెజారిటీ వైరల్ బాపతే ఉంటాయి. మూడునాలుగు రోజుల్లో స్వస్థత చేకూరుతుంది. బిడ్డకు కొద్దిగా జ్వరం ఉన్నా.. హుషారుగా ఉంటే ఇబ్బందేం లేదు. యాంటి బయాటిక్స్ అవసరం కూడా రాకపోవచ్చు. కానీ, మూడు రోజులు దాటి జ్వరం కొనసాగినా, తీవ్రత అధికంగా ఉన్నా.. పీడియాట్రీషియన్‌ను సంప్రదించాలి. వేరే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఏదీ లేదని నిర్ధారించుకోవడం కోసం అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. తగిన చికిత్స తీసుకుంటే సరిపోతుంది. ఇక, మీ బాబు విషయంలో.. ఎత్తు, బరువు గురించి ప్రస్తావించలేదు. మిగతా అన్నీ బాగానే ఉంటే.. మూడు, నాలుగుసార్లు సీఆర్పీ పెరిగినంత మాత్రాన ఇబ్బందేం ఉండదు. పీడియాట్రీషియన్ సలహా మేరకు చికిత్స తీసుకోండి.

# అధిక బరువును తగ్గించుకోవాలంటే అన్నం తినడం పూర్తిగా మానేయాలా..?

అధిక బరువు సమస్య ప్రస్తుతం చాలా మందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. అధికంగా ఉన్న బరువు కారణంగా అనేక మంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. వేళకు భోజనం చేయకపోవడం, రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేయడం, ఆలస్యంగా నిద్రించడం, బయటి ఫుడ్ లేదా జంక్ ఫుడ్‌ను అధికంగా తినడం, మద్యం అధికంగా సేవించడం వంటి అనేక కారణాల వల్ల చాలా మంది అధికంగా బరువు పెరుగుతున్నారు. అయితే బరువు తగ్గేందుకు చాలా మంది అనేక రకాల డైట్‌లను పాటిస్తుంటారు. ఈ క్రమంలోనే అన్నం తినడం కూడా పూర్తిగా మానేస్తారు.



లేదంటే బరువు తగ్గమేమోనని ఆందోళన చెందుతారు. అన్నంకు బదులుగా చపాతీలు, ఇతర ఆహారాలను తినేందుకు ప్రయత్నిస్తారు. అయితే అధిక బరువు తగ్గాలంటే కచ్చితంగా అన్నం తినడం మానేయాలా..? అన్నం తింటూ కూడా బరువును తగ్గించుకోలేమా..? అంటే ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

పిండి పదార్థాలు మనకు రోజూ అవసరమే.. కానీ..అధిక బరువును తగ్గించుకోవాలంటే డైట్ పాటించాలి. కానీ అన్నం తినడం పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అన్నం తింటూ కూడా బరువును తగ్గించుకోవచ్చు.. అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనే నెపంతో కొందరు అన్నం తినడం పూర్తిగా మానేస్తారు. కానీ అలా చేయాల్సిన పనిలేదని అంటున్నారు. అన్నాన్ని రోజూ కొద్ది కొద్దిగా తినవచ్చని సూచిస్తున్నారు. అన్నం అంటే పూర్తిగా పాలిష్ చేయబడిన బియ్యంతో వండేది. ఇందులో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. అవి మన శరీరంలో అధికంగా చేరితే కొవ్వు కింద మారుతాయి. దీంతో బరువు పెరుగుతారు. అయితే ఇలా జరిగే మాట వాస్తవమే. కానీ అంత మాత్రాన అన్నం తినడాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. రోజూ మనకు పిండి పదార్థాలు కూడా అవసరం అవుతాయి. కనుక మనకు కావల్సినంత మోతాదులో అన్నాన్ని కూడా తినాల్సి ఉంటుంది.

ఒక కప్పు అన్నం తింటే..

సాధారణంగా చాలా మందికి రోజూ 70 నుంచి 100 గ్రాముల మేర పిండి పదార్థాలు అవసరం అవుతుంటాయి. కనుక అన్నాన్ని పూర్తిగా మానేయాల్సిన పనిలేదు. అయితే ఈ పిండి పదార్థాలు లభించాలంటే అన్నాన్ని ఒక్కసారి ఒక కప్పు మోతాదులో మాత్రమే తినాలి. అంతకు మించి తినకూడదు. ఒక కప్పు అన్నం తింటే సుమారుగా 40 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి.

# బిజినెస్
# BUSINESS


## ఏథర్ రిజ్తా విక్రయాల్లో దూకుడు..
# 20 నెలల్లో 2 లక్షల మైలురాయి

ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీకి చెందిన ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ రిజ్తా అరుదైన మైలురాయిని సాధించింది. దేశవ్యాప్తంగా 2 లక్షల విక్రయాల మైలురాయిని అందుకుంది. ఈ ఏడాది మే నెలలోనే లక్ష స్కూటర్ల మైలురాయిని చేరుకున్న.. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్.. ఏడు నెలలు తిరగకముందే మరో లక్ష స్కూటర్లను విక్రయించింది. ఏథర్ ఎనర్జీ విక్రయిస్తున్న వాహనాల్లో బెస్ట్ సెల్లింగ్ మోడల్‌గా నిలిచింది. 2024 ఏప్రిల్‌లో రిజ్తాను ఏథర్ ఎనర్జీ లాంచ్ చేసింది. అప్పటి వరకు కేవలం దక్షిణాది రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన ఏథర్‌ను.. మధ్య భారతానికి విస్తరించడానికి ఈ స్కూటర్ ఎంతగానో దోహదపడింది. ఏథర్ మొత్తం విక్రయాల్లో ఒక్క రిజ్తా వాటానే 70 శాతం మేర ఉందంటే ఈ స్కూటర్‌కున్న డిమాండ్ ఏపాటిదో తెలుస్తోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఈ ఏడాది (క్యాలెండర్ సంవత్సరం) క్యూ1లో 7 శాతంగా ఉన్న



ఏథర్ మార్కెట్ వాటా.. క్యూ3లో 14 శాతానికి పెరిగింది. పంజాబ్‌లో 8 నుంచి 15 శాతానికి, ఉత్తర్‌ప్రదేశ్‌లో 4 నుంచి 10 శాతానికి పెరిగింది. ఏథర్ రిజ్తా ఫ్యామిలీ స్కూటర్ ద్వారా మధ్య, ఉత్తర భారతంలో తమ మార్కెట్ బాగా వృద్ధి చెందిందని ఏథర్ ఎనర్జీ సీబీఓ రవ్‌నీత్ సింగ్ తెలిపారు. తమ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను, తమ మార్కెట్ వాటాను మరింత పెంచుకుంటామని తెలిపారు. ఇక రిజ్తా విషయానికొస్తే.. ఇది రెండు మోడళ్లలో లభ్యమవుతుందది. రిజ్తా ఎస్, రిజ్తా జడ్. రిజ్తా ఎస్ 123 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌తో తీసుకొచ్చారు. రిజ్తా జడ్ సింగిల్ ఛార్జ్‌తో 159 కిలోమీటర్లు ప్రయణించొచ్చు. విశాలమైన సీట్, అధిక స్టోరేజీ కెపాసిటీ, లెగ్‌స్పేస్ కారణంగా ఈ స్కూటర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. దీనికితోడు స్కిడ్ కంట్రోల్, ఫాల్ సేఫ్, ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్, థెఫ్ట్ అండ్ టో అలర్ట్స్, పింగ్ మై స్కూటర్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. భారత్ సహా శ్రీలంక, నేపాల్‌లోనూ దీన్ని ఏథర్ విక్రయిస్తోంది.

## లేబర్ కోడ్స్: టేక్‌హోమ్ శాలరీపై ఎఫెక్ట్.. కార్మిక శాఖ క్లారిటీ



పాత కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు కొత్త లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చింది. వీటివల్ల చాలా మందికి చేతికందే వేతనం తగ్గుతుందన్న (టేక్‌హోమ్ శాలరీ) ప్రచారం ఊపందుకుంది. దీనిపై తాజాగా కేంద్ర కార్మిక శాఖ వివరణ ఇచ్చింది. టేక్‌హోమ్ శాలరీపై ఎలాంటి ప్రభావమూ పడబోదని తెలిపింది. సీటీసీలో బేసిక్ శాలరీ 50 శాతానికి పెరిగినా, అలవెన్సుల్లో కోత పడుతుందే తప్ప చేతికందే వేతనంపై ఎలాంటి ప్రభావమూ ఉండబోదని స్పష్టంచేసింది. కొత్త లేబర్ కోడ్స్ వల్ల ఉద్యోగుల చేతికందే వేతనంలో ఎలాంటి మార్పూ ఉండబోదని కార్మిక శాఖ తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. ప్రావిడెంట్ ఫండ్ (EPF) చట్టబద్ధ వేతన పరిమితి రూ.15 వేలుగా ఉండడమే దీనికి కారణమని తెలిపింది. ఈ పరిమితిపై కొత్త లేబర్ కోడ్‌ల ప్రభావం ఉండబోదు కాబట్టి చేతికందే వేతనంలో ఎలాంటి మార్పూ ఉండబోదని స్పష్టంచేసింది. ఆ పరిమితికి మించి కాంట్రిబ్యూట్ చేయడమనేది స్వచ్ఛందమని, తప్పనిసరి కాదని తెలిపింది. దీన్ని ఓ ఉదాహరణతో వివరించింది. A అనే వ్యక్తికి నెలకు రూ.60వేలు వేతనం అనుకుందాం. పాత కార్మిక చట్టాల ప్రకారం.. బేసిక్+ డీఏ భాగం రూ.20వేలు. అలవెన్సులు రూ.40వేలు అందుతున్నాయి. అదే వ్యక్తి జీతంపై చట్టబద్ధ ఈపీఎఫ్ పరిమితి కింద ఉద్యోగి వాటా రూ.1800, యజమాని వాటా రూ.1800గా ఉంటుంది. అలాంటప్పుడు టేక్ హోమ్ శాలరీ రూ.56,400గా అందుతుంది. లేబర్ కోడ్‌ల అమలు తర్వాత కూడా ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితిలో ఎలాంటి మార్పూ ఉండదు కాబట్టి అంతేమొత్తం వేతనంగా అందుతుందని స్పష్టంచేసింది. రూ.15 వేల వేతన పరిమితి అనేది తప్పనిసరిగా కంపెనీలు అమలు చేయాల్సిన పరిమితి అని కార్మిక శాఖ స్పష్టంచేసింది. కొత్త కార్మిక కోడ్‌లలో దీంట్లో ఎలాంటి మార్పూ లేదని స్పష్టంచేసింది. ఉద్యోగి, యజమాని పరస్పర అంగీకారంతో కావాలంటే పరిమితికి మించి కాంట్రిబ్యూట్ చేయొచ్చని పేర్కొంది. పరిమితి పెంచుకోవాలా వద్దా అనేది ఉద్యోగి, యజమానికి వదిలేసినట్లు కార్మిక శాఖ స్పష్టంచేసింది. అయితే, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి విషయాల్లో టేక్‌హోమ్ శాలరీపై ప్రభావం ఉండొచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

## ఆ ప్రయాణికులకు
# రూ.10వేల ట్రావెల్ వోచర్లు: ఇండిగో ప్రకటన

పైలట్ల కొరత వంటి కారణాలతో కొన్నిరోజులపాటు తీవ్రసంక్షోభంలో చిక్కుకుపోయిన దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. గురువారం నడపనున్న 1950కి పైగా సర్వీసుల్లో మూడు లక్షల మంది ప్రయాణించనున్నారని వెల్లడించింది. అదే సమయంలో సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బంది పడిన ప్రయాణికులకు రూ.10వేల విలువైన వోచర్‌ను పరిహారం కింద ఇస్తామని తెలిపింది. డిసెంబర్ 35 మధ్య సర్వీసుల రద్దు కారణంగా ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. అలా తీవ్రంగా ఇబ్బందులుపడిన ప్రయాణికులకు (వీరిని ఎలా ఎంపిక చేస్తుందో మాత్రం వెల్లడించలేదు) ఇండిగో పరిహారం ప్రకటించింది. వారికి ఈ ట్రావెల్ వోచర్లు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. రానున్న 12 నెలల్లో ఇండిగో ప్రయాణంలో వాటిని



వాడుకోవచ్చని తెలిపింది. విమానం బయల్దేరడానికి 24 గంటలలోగా విమాన సర్వీసు రద్దయితే.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన పరిహారానికి ఇది అదనమని తెలిపింది. ''ఇండిగో తన కార్యకలాపాలను బలోపేతం చేస్తోంది. సర్వీసుల పునరుద్ధరణ రోజురోజుకూ మెరుగవుతోంది. ఈ రోజు మా నెట్‌వర్క్ పరిధిలోని 138 గమ్యస్థానాలను అనుసంధానించేలా మా సర్వీసులు కొనసాగనున్నాయి'' అని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఇండిగో వెల్లడించింది. వాతావరణం, సాంకేతిక, నియంత్రణలోని కొన్ని కారణాల వల్ల మాత్రమే స్వల్ప సంఖ్యలో సర్వీసులు రద్దవుతున్నాయని చెప్పింది. ఇటీవల వారం రోజులకు పైగా ఈ విమానయాన సంస్థ వందల కొద్దీ సర్వీసుల్ని రద్దు చేసింది. దాంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కేంద్రం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని, దర్యాప్తు కమిటీ వేసింది. ఇదిలా ఉంటే.. తమ సేవలు గాడిన పడుతున్నాయని డిసెంబర్ 9న సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మామూలుగా అయితే ఈ సంస్థ రోజూ 2,200పైగా సర్వీసుల్ని నడుపుతుంటుంది.

## టీ20 వరల్డ్ కప్ ముంగిట..
# ఓపెనింగ్ కటకట!

దాదాపు మరో రెండు నెలల్లోనే టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. అభిషేక్ శర్మ ఓపెనర్‌గా ఇప్పటికే స్థిరస్థానం సంపాదించుకున్నాడు. మరో ఓపెనర్‌గా సంజుశాంసన్ జమాన్యం వైస్‌కెప్టెన్ గిల్‌ను ఓపెనర్‌గా పంపుతోంది. అతడు పవర్‌ప్లేలో ఎలా ఆడాలో తెలియక ఒత్తిడికి చిత్తవుతున్నాడు. తేలిగ్గా తన వికెట్‌ను కోల్పోతున్నాడు. ఆసియా కప్‌లోనూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. ఆస్ట్రేలియా టూర్‌లోనూ బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. ప్రస్తుతం టీమ్ఇండియా దక్షిణాఫ్రికాతో అయిదు టీ20 సిరీస్ ఆడుతోంది. ఇందులో భాగంగా మంగళవారం (డిసెంబర్ 9) కటక్ వేదికగా జరిగిన తొలి టీ20లోనూ గిల్ చేతులెత్తేశాడు. బంతిలోని బౌన్స్‌ను అంచనా వేయడంలో విఫలమై.. ఇన్‌ఫీల్డ్‌ను క్లియర్ చేయలేక ఫీల్డర్ చేతికి చిక్కి కేవలం 4 పరుగులకే వెనుదిరిగాడు. ఇలా టీ20ల్లో తన పరాజయ పరంపరను కొనసాగిస్తున్నాడు.

### కనీసం రెండో మ్యాచ్‌లోనైనా..

మరి కొన్ని గంటల్లోనే ముల్లాన్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికా, టీమ్ఇండియా మధ్య రెండో టీ20 ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అభిమానుల అందరి చూపు సంజుశాంసన్‌పై ఉంది. మొదటి టీ20లో తుది జట్టులో అవకాశం దక్కించుకోని సంజుశాంసన్ కనీసం రెండో మ్యాచ్‌లోనైనా మైదానంలోకి దిగుతాడా? అని ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు. అయితే మొదటి టీ20లో వికెట్ కీపర్‌గా జట్టులోకి వచ్చిన జితేశ్ శర్మ.. సంజుశాంసన్‌కు పోటీ కాదు. అయితే వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వల్లే అతడు జట్టులో స్థానం కోల్పోతున్నాడని



అభిప్రాయపడుతున్నారు.

### టీ20లకు రో-కో రిటైర్మెంట్‌తో..

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సంజుశాంసన్ ఓపెనర్ అవతారమెత్తాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి పలు అద్భుత ఓపెనింగ్ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అలాగే కీపర్‌గానూ రాణించాడు! రెగ్యులర్ ఓపెనర్‌గా జట్టులో స్థానం సుస్థిరం చేసుకుంటున్న సమయంలోనే శుభ్‌మన్ గిల్ వైస్‌కెప్టెన్‌గా టీ20 జట్టులోకి వచ్చాడు. ఓపెనర్‌గా గిల్ విఫలమవుతున్నప్పటికీ జట్టు యాజమాన్యం అతడికి వరుస అవకాశాలిస్తోంది. ఈ పరిణామం సంజుశాంసన్‌కు జట్టులో స్థానాన్ని కోల్పోయేలా చేస్తోంది. కొన్నిసార్లు సంజుశాంసన్ లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసినప్పటికీ.. ఓపెనింగ్ స్థానంలో సాధించినన్ని పరుగులు చేయలేకపోయాడు. దీంతో ఫినిషర్‌గా జితేశ్‌శర్మ వైపు టీమ్ఇండియా యాజమాన్యం మొగ్గు చూపుతోంది.

# క్రీడలు

## నేను .. యూట్యూబ్ ఛానల్
# ఎందుకు ప్రారంభించానంటే : అర్ష్‌దీప్ సింగ్


టీమ్ఇండియా టీ20 స్పెషలిస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ మైదానంలో బంతితోనే కాదు.. సోషల్‌మీడియాలో వీడియోలతోనూ ఆకట్టుకుంటున్నాడు. ఇటీవల కోహ్లీతో చేసిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. అలాగే తాను జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి రీల్ చేయాలంటే అతడు మరిన్ని వికెట్లు తీసుకోవాల్సిందే.. అని చేసిన సరదాగా వ్యాఖ్యలూ నెటిజన్ల దృష్టిని ఆకట్టుకున్నాయి. అలాగే తాను అసలు యూట్యూబ్ ఛానల్ ఎందుకు ప్రారంభించాల్సి వచ్చిందో.. జియోహాట్ స్టార్‌తో మాట్లాడుతూ వివరించాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీలో మొదటి మ్యాచ్‌లో నాకు ఆడే అవకాశం రాలేదని తెలిశాక, నేను నా గదిలో బోర్‌గా ఫీలయ్యా. అప్పుడు నేను యూట్యూబ్ ఛానల్ ప్రారంభించా. అయితే అది ఒక వరంగా మారిపోయింది. నేను ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని చూస్తాను. ఈ స్థాయిలో ఆడుతున్నందుకు కృతజ్ఞతతో ఉండాలి. కొన్నిసార్లు అవకాశాల కోసం



ఎదురు చూడాల్సి రావొచ్చు. మన వంతు వచ్చాక మాత్రం, వాటిని సద్వినియోగం చేసుకోవాలి' అని అర్ష్‌దీప్ సింగ్ అన్నాడు. విశాఖపట్నంలో శనివారం (డిసెంబర్ 6న) దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా విజయం అనంతరం అర్ష్‌దీప్ సింగ్, విరాట్ కోహ్లీతో కలిసి ఓ రీల్ చేశాడు. ఒక్క రోజు వ్యవధిలోనే దానికి 10 కోట్ల వ్యూస్ వచ్చాయి. రాంచి, రాయ్‌పుర్‌లో జరిగిన వన్డేల్లో వరుస సెంచరీలు చేసిన కోహ్లీ.. విశాఖపట్నం మ్యాచ్‌లో 45 బంతుల్లో 65 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. అతడు బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి చేయాల్సిన పరుగులు 116 మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అర్ష్‌దీప్.. 'టార్గెట్ చిన్నది కాబట్టి నువ్వు సెంచరీ చేయలేకపోయావు కదా..' అని కోహ్లీని అడిగాడు. దానికి విరాట్ తనదైన శైలిలో.. 'టాస్ గెలిచాం కాబట్టి సరిపోయింది. లేదంటే ఈ ద్యూ వల్ల నువ్వు సెంచరీ కొట్టేవాడివి' (బౌలింగ్‌లో ధారాళంగా పరుగులు ఇచ్చేవాడివి అనే అర్థంలో..) అనడంతో నవ్వులు విరిశాయి. ఈ రీల్‌కు అభిమానులు లైక్‌ల వర్షం కురిపిస్తున్నారు.


## గౌతమ్ గంభీర్..
# రోకోకు క్రెడిట్ ఇవ్వలేదు: రాబిన్ ఉతప్ప

దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్‌సిరీస్‌ను 20 తేడాతో కోల్పోయి, టీమ్ఇండియా వైట్‌వాష్‌కు గురైన విషయం తెలిసిందే. అయితే భారత జట్టు వన్డేల్లో తన సత్తా చాటింది. ఈ సిరీస్‌ను టీమ్ఇండియా 21 తేడాతో కైవసం చేసుకుంది. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌లో రాణించారు. ముఖ్యంగా కోహ్లీ.. రాంచీ, రాయ్‌పుర్ వన్డేల్లో వరుస సెంచరీలు, విశాఖపట్నంలో అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగిపోయాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అతడు ఏకంగా 302 పరుగులు సాధించి, టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరోవైపు రోహిత్ శర్మ రాంచీలో (57), విశాఖపట్నంలో (75) హాఫ్‌సెంచరీలతో రాణించాడు. రాయ్‌పుర్ వన్డేలో మాత్రం 14 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా 146 రన్స్ సాధించాడు. ఇలా వీరిద్దరూ టీమ్ఇండియా వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో



కీలకపాత్ర పోషించారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ తన మొదటిస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. విరాట్ కోహ్లీ రెండో స్థానానికి దూసుకొచ్చాడు. అయితే.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్‌గంభీర్.. సిరీస్ విజయం తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించలేదని, టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప విమర్శించాడు. వారికి క్రెడిట్ ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'టీమ్ఇండియా వన్డే సిరీస్ విజయం సాధించిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి క్రెడిట్ ఇవ్వడాన్ని నేను గమనించలేదు. రోకో ద్వయం తమ ఫామ్‌పై వస్తున్న సందేహాలకు తమ ప్రదర్శనతో చెక్ పెట్టారు. తమ బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించారు.

## మూడు గంటలు అడవిలో
# చిమ్మచీకట్లో ఉండిపోయా : రానా



రానా, విష్ణు విశాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అడవి, ఏనుగుల రక్షణ కోసం పాటుపడే వ్యక్తిగా రానా నటించారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో రానా ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలోకి ఏనుగుల గుంపు వచ్చిందని చెప్పారు. ''అరణ్య షూటింగ్ కోసం ఆరు నెలలు అడవిలో ఉన్నాం. మేము కొన్ని సన్నివేశాలను ఏనుగులు ఉండే ప్రాంతంలో చేశాం. సాయంత్రం సమయానికి వెళ్లిపోవాలి అన్నారు. అనుకున్న టైమ్‌కు మన షూటింగ్‌లు ఎప్పుడూ ముగించరని అందరికీ తెలిసిందే. దీంతో రాత్రి వరకూ అక్కడే ఉన్నాం. నేను సన్నివేశంలో భాగంగా దూరంగా ఉన్నాను. సడన్‌గా అందరూ గబగబా వెళ్లిపోతున్నారు. ఎందుకు ఇలా పరిగెడుతున్నారు అని చూసేసరికి ఏనుగులు మా వైపునకు వస్తున్నాయి. దీంతో నేను, మరికొంతమంది వాటికి కనిపించకుండా చెట్ల చాటుకు వెళ్లాం. కొంచెం కూడా శబ్దం చేయకుండా అలానే మూడు గంటలు ఉన్నాం. ఆ చిమ్మచీకట్లో అలా మూడు గంటలు ఉండడం ఎప్పటికీ మర్చిపోలేను. అడవి ఎంత భయంకరంగా ఉంటుందో మొదటిసారి అప్పుడే అర్థమైంది'' అని రానా ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' తర్వాత రానా నటించిన సినిమా 'అరణ్య'. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత విడుదలైన తొలి పాన్ ఇండియా చిత్రం కూడా ఇదే. ఇందులో రానా ఫారెస్ట్ మేన్‌గా నటించారు. సందేశాత్మక చిత్రంగా ఆకట్టుకుంది.

# ఓటీటీలోకి అల్లరి నరేశ్ కొత్త సినిమా.. 12ఏ రైల్వే కాలనీ స్ట్రీమింగ్ ఎక్కడంటే!




అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు సడన్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయికుమార్, గెటప్ శ్రీను, వైవా హర్ష తదితరులు నటించారు. కథేంటంటే..: కార్తీక్ (అల్లరి నరేశ్) అనాథ. వరంగల్‌లోని రైల్వేకాలనీలో ఫ్రెండ్స్‌తో కలిసి జీవిస్తుంటాడు. లోకల్ రాజకీయ నాయకుడు టిల్లు (జీవన్)కి తను నమ్మిన బంటు. గత రెండు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన టిల్లు.. ఈసారి ఎలాగైనా పదవిలోకి రావాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. ఆ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ఓ బాధ్యతను కార్తీక్ భుజాన పెడతాడు. దానిలోభాగంగా యువతను ఆకర్షించేందుకు కార్తీక్ ఓ ఆటల పోటీ నిర్వహిస్తాడు. ఆ పోటీల్లోనే ఆరాధన (కామాక్షి భాస్కర్ల) ను చూసి మనసు పారేసుకుంటాడు. మరి ఆ తర్వాత ఏం జరిగింది? అసలు ఆరాధన ఎవరు? ఆమె నేపథ్యమేంటి? ఆరాధన తన భార్యంటూ కథలోకి వచ్చిన జయదేవ్ షిండే (అనీష్ కురువిల్లా)కి, హత్యకు ఏమైనా సంబంధం ఉందా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# ధురంధర్.. బాగుంది కానీ..
## : హృతిక్ రివ్యూపై విమర్శలు



ఇటీవల విడుదలైన ధురంధర్ ప్రశంసలు అందుకుంటుంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు ఈ చిత్రంపై రివ్యూ ఇవ్వగా తాజాగా హృతిక్ రోషన్ దీని గురించి మాట్లాడారు. అయితే, ఆయన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుపడుతున్నారు. సినిమా చాలా బాగుందన్న హృతిక్ ఇందులో చూపించిన రాజకీయ అంశాలను తాను అంగీకరించనని అన్నారు. ''నాకు ఈ చిత్రం చాలా నచ్చింది. ఇంత గొప్ప కథను ప్రేక్షకులకు అందించినందుకు చిత్ర బృందానికి అభినందనలు. హృదయానికి హత్తుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. కథను తెరకెక్కించిన విధానం మెప్పించింది. సినిమా అంటే ఇలా ఉండాలి అనిపించింది.

# కార్తి మూవీ.. రిలీజ్‌కు మద్రాస్ హైకోర్టు 'నో'

చెన్నై (ప్యారిస్): కార్తి హీరోగా నటించిన 'వా వాతియార్' (అన్నగారు వస్తారు) సమస్యల్లో చిక్కుకుంది. ఈ సినిమా విడుదలను నిలుపుదల చేస్తూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మాత జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఈ నెల 12న విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు.

**ఏం జరిగిందంటే?**

గతంలో పారిశ్రామికవేత్త అర్జున్ లాల్ సుందర్ దాస్ వద్ద స్టూడియో గ్రీన్ జ్ఞానవేల్ రాజా రూ.10.35 కోట్లు అప్పు తీసుకున్నారని, ఆ మొత్తం ప్రస్తుతం రూ. 21.78 కోట్లు అయిందని, దానిని చెల్లించాలంటూ నిర్మా తకు ఉత్తర్వులు ఇవ్వాలని అర్జున్ లాల్ ఆస్తిపై నియమితులైన నిర్వాహకుడి తరపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా విడుదలకు స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌కు ఇంతకుముందు విచారించిన హైకోర్టు.. సినిమా విడుదలకు స్టే విధించింది. ఈ పిటిషన్ మరోసారి విచారణకు వచ్చింది. పలుసార్లు అవకాశం ఇచ్చినప్పటికీ జ్ఞానవేల్ రాజా అప్పు తిరిగి ఇవ్వలేదని, కనుక ఆయన ఆస్తులను జప్తు చేయాలంటూ ఆస్తి నిర్వాహకుడు తరపున హాజరైన లాయర్ వాదించారు. జ్ఞానవేల్ రాజాకు కోర్టు పలుమార్లు అవకాశం ఇచ్చిందని, ఇకపై మళ్లీ అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపి, అప్పు తిరిగి చెల్లించే వరకూ విడుదల చేయకూడదని నిషేధం విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, 'త్వరలోనే విడుదల' అంటూ నిర్మాణ సంస్థ తాజాగా పోస్టు పెట్టింది. కొత్త విడుదల తేదీ ప్రకటించే అవకాశాలున్నాయి.



# సినిమా

# ట్రీట్ ఎప్పుడు?

మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కిస్తున్న చిత్రం మన శంకర వరప్రసాద్ గారు. నయనతార హీరోయిన్. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. మంచి బజ్ ఉన్న ఈ సినిమా నుంచి ఇప్పుడు వరకు వచ్చిన పాటలు సూపర్ హిట్ అయ్యి కావాల్సినంత రీచ్ ని సొంతం చేసుకున్నాయి. 'మీసాల పిల్ల', 'శశిరేఖ' సాంగ్స్‌ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదంతా బాగానే ఉంది కానీ అసలు కంటెంట్ ఎప్పుడు వస్తుంది అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. సాంగ్స్ వరకు చూస్తే కాదు కనీసం టీజర్ వదిలితే అయినా అసలు సినిమా ఎలా ఉండబోతుంది? కంటెంట్ ఏంటి? అసలు ట్రీట్ ఎప్పుడిస్తరు అంటూ ఫ్యాన్స్ నెట్టింట కామెంట్స్‌చేస్తున్నారు.. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందించగా షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి మూవీని గ్రాండ్‌గా రిలీజ్‌చేసేందుకు మేకర్స్‌సన్నాహకాలు చేస్తున్నారు.

# బ్యాక్ టు బ్యాక్

'అలా ఎలా' అనే సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన బ్యూటీ హెబ్బా పటేల్.. మొదటి సినిమాతోనే తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. తన అందంతో ప్రతి ఒక్కరి మనసు దోచేసింది. తర్వాత కుమారి '21 ఎఫ్'తో ఎంట్రీ ఇచ్చి కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. అంతే కాకుండా యూత్ కలల రాణిగా మారిపోయింది. ఇక ఈ మూవీ తర్వాత హెబ్బాకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. కానీ వచ్చి సినిమాలు అన్నీ ఫ్లాప్ అవ్వడంతో అవకాశాలు తగ్గిపోయి, ఈ బ్యూటీ క్రేజ్ కూడా పోయింది. దీంతో ప్రస్తుతం వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ సినిమాలు చేస్తుంది. ఇటీవల ఓదెల రైల్వే స్టేషన్ లో డీ గ్లామర్ రోల్ చేసిన హెబ్బా ఆ తర్వాత చెప్పుకోదగ్గ సినిమాలు చేయలేదు. ఇక కెరీర్ డైలామాలో పడిపోతున్న టైంలో మరోసారి గ్లామర్‌నే నమ్ముకుంది బ్యూటీ. అదీ కూడా అడల్ట్ కంటెంట్ మూవీ మారియోతో రాబోతోంది. ఇప్పుడు తనలోని పాత టాలెంట్ బయటకు తీస్తోంది. మరింత గ్లామర్ డోస్ పెంచి మళ్లీ యూత్ అటెన్షన్ గ్రాబ్ చేసేందుకు ప్లాన్ చేస్తుంది. ఈనెల 19న థియేటర్లలోకి రాబోతోంది మారియో ఫిల్మ్. దీనితో పాటు హారర్ ఫిల్మ్ ఈషాతో సందడి చేయబోతోంది హెబ్బా. యంగ్ హీరో త్రిగుణ్‌తో కలిసి మరోసారి జోడీ కడుతోంది. ఈనెల 25న గ్రాండ్‌గా రిలీజ్‌కానుంది.



# బుకింగ్స్‌లో ర్యాంపేజ్



నందమూరి నటసింహం బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో తెరకెక్కించిన చిత్రం అఖండ 2 తాండవం కోసం ఫ్యాన్స్ ఓ రేంజ్ లో ఎదురు చూస్తున్నారు. ఇక ఫైనల్ గా ఈ సినిమా గ్రాండ్ గా ఇవాళ ప్రీమియర్స్ తో థియేటర్స్ లో వస్తుండగా రేపు ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ కి రాబోతుంది. ఇక ఈ మూవీకి అనకాపల్లి నుంచి అమెరికా వరకు రోరింగ్ రెస్పాన్స్ వస్తుంది. యూఎస్ మార్కెట్ లో కూడా ఇలా బుకింగ్స్ ఓపెన్ చేయగానే సెన్సేషన్ ని సెట్ చేసింది. ఇక ఈ సినిమా నార్త్ అమెరికాలో క్రేజీ ఓపెనింగ్స్ ని సెట్ చేసుకుంది. ఇలా ప్రీమియర్స్ వసూళ్లు అప్పుడే 2 లక్షల 50 వేల డాలర్స్ కి పైగా అందుకొని స్ట్రాంగ్ ఓపెనింగ్స్ పై కన్నేసింది. తెలుగు స్టేట్స్ లో, ఇంకొన్ని ప్రాంతాల్లో కూడా ఫుల్ గా ఓపెన్ చేయకుండానే బుక్ మై షో ట్రెండింగ్ లో లక్షల్లో టికెట్లు సేల్స్అయ్యాయి. అఖండ 2 రెండో సారి ఇలా బుకింగ్స్ ఓపెన్ అయ్యాయో లేదో అక్కడ ఇక్కడ అని తేడా లేకుండా బాలయ్య తాండవం చూపిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటించగా హర్షాలీ మల్హోత్రా, ఆది పినిశెట్టి తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. అలాగే థమన్ సంగీతం అందించగా 14 రీల్స్ ప్లస్ వారు నిర్మాణం వహించారు.

# మున్సిపాలిటీలను కలపడాన్ని వ్యతిరేకిస్తూ కమీషనర్ ని కలిసిన కొప్పుల నర్సింహ్మా రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి): జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ తో బిజెపి సీనియర్ నాయకులు మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, మాజీ మంత్రి కృష్ణ యాదవ్,మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రావు, బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు,మాజీ మేయర్ బండ కార్తిక, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చంద్రజీ,రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కమిషనర్ ఆర్వీ కర్ణన్ కు మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో కలపడాన్ని వ్యతిరేకిస్తు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ..650 కిలోమీటర్ల పరిధి ఉన్న గ్రేటర్ హైదరాబాద్ ని 2వేల కిలోమీటర్లకు పెంచారు. అదేవిధంగా ప్రజల అభిప్రాయాలను స్వీకరించకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా విలీనం చేయడం, డివిజన్ల పెంపు నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంకి వార్డ్ సెన్సెస్ ఇవ్వాలి కాబట్టి ఇప్పుడు చేశామని కమిషనర్ చెపుతున్నారు. మున్సిపాలిటీల విలీనం, డివిజన్లను పెంచడం ఒక వర్గానికి న్యాయం చేసేందుకు ఇది చేశారు అని అన్నారు. వార్డులకు సంబంధించిన మ్యాప్ లు ఏమీ లేవు వాళ్ల సొంత ఆలోచనలతో డివిజన్లో విభజించారు. మ్యాప్ లు వెంటనే ఇవ్వాలని అడిగారు. 150 వార్డ్స్ జనాభా, ఓటర్లు ఎంత మంది ఉన్నారు వాటి వివరాలు కొత్త వాటి వివరాలు పొందపరచాలని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మజ్లిస్ కోసం ప్రభుత్వం కుమ్మక్కై మున్సిపాలిటీ,కార్పొరేషన్,డివిజన్ల విలీనం చేసింది అని అన్నారు. మజ్లిస్ గెలుపు కోసం కొత్త వార్డ్స్ తీసుకొచ్చారు. ఏ విధంగా డివిజన్లు ఏర్పాటు చేశారని ప్రజలపై టాక్స్ ఏవిధంగా వేస్తారని కమిషనర్ ని అడిగామన్నారు.ప్రత్యేకంగా వార్డ్స్ విషయంలో కమిషనర్ కి చెప్పాం అన్నారు.మా పార్టీ మున్సిపాలిటీ నాయకులు మరియు 48 మంది జిహెచ్ఎంసి కార్పొరేటర్లతో కలిసి మేము కమిటీలు వేసుకొని 17వ తేదీ లోపు కమిషనర్ కి మా నివేదిక ఇస్తామని తెలిపారు.

* **జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ..**

మహానగరాన్ని మంచి నగరంగా చేయాలని బీజేపీ ఆలోచిస్తుంది అన్నారు. మాకు వార్డ్స్, జోనల్, పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉన్న అభ్యంతరాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తూ మా సీనియర్ నాయకులతో కలిసి తక్కువ జనాభా ఉన్నచోట డివిజన్లో పెంచి, ఎక్కువ జనాభా ఉండే చోట తక్కువ డివిజన్లను చేసి ఇంకా ప్రజల వద్ద నుండి టాక్సీ వాసులు చేసేందుకు తప్పుడు నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు.. నిరంకుశంతో ఈ విలీన నిర్ణయం తీసుకున్నారు. మజ్లిస్ పార్టీకి వత్తాసుగా విలీన కార్యాచరణను వారికి మద్దతుగా ఉందన్నట్లు అన్నారు. పాతబస్తి లోని కొన్ని ప్రాంతాల్లో కేవలం 10 నుండి 20వేల ఓట్లకు మాత్రమే ఒక డివిజన్లో ఏర్పాటు చేశారు. అదేవిధంగా మహానగరానికి శివారు ప్రాంతమైన బడంగ్పేట్ బాలాపూర్ పెద్ద అంబర్పేట్ కుంట్లూర్ ఇంకా ఘట్కేసర్ వంటి ప్రాంతాల్లో కూడా రెండు సంవత్సరాల్లోపే లక్ష పైచిలుకు జనాభా దాటే అవకాశం ఉన్న చోట్లు మాత్రం ఒక్కొక్క డివిజన్ ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదని తెలిపారు. విలీనంపై అభ్యంతరం తెలుపుతూ, రాత్రికి రాత్రి దొంగల్లా ఈ యొక్క నిర్ణయం తీసుకోవడం జీఓను విడుదల చేయడం కనీసం మేము ఒక కార్పొరేటర్లుగా ఉన్నప్పటికీ కొంత సమాచార సేకరణ కూడా చేయకుండా విలీన నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. మళ్లీ అదే ద్వంద నీతిగా గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తూ మా హిందువుల నుండి టాక్స్లు వసూలు చేస్తూ మళ్ళీ పాత బస్తీల్లోకి నిధులను మళ్ళీ ఇస్తామని విధంగా శివారు ప్రాంతాలనేమో తక్కువ జనాభా ఉన్నట్లుగా ఒక డివిజన్ చేసి పాత బస్తిలో మాత్రం చిన్న చిన్న డివిజన్లను మూడు ముక్కలు చేసి ఈ ప్రభుత్వం కూడా ఎంఐఎం కనుసనల్లో పనిచేస్తున్నట్లుందని అన్నారు.విలీనం మార్పులు చేర్పుల కొరకు శివారు ప్రాంతాల్లో అభిప్రాయ సేకరణ వారం రోజులు ఇవ్వడంతో వారు ఏ కార్యాలయంలో ఇవ్వాలన్న సమాచారం తెలుసుకోవడానికి మరియు వాళ్ళు పొందపరచుకోవాలన్న ప్రాంతాన్ని చూడడానికి మీరిచ్చిన హద్దులు నార్త్,ఈస్ట్,వెస్ట్,సౌత్ అని తెలిపిన విషయం ఒక మ్యాప్ విడుదల చేయకుండా గజిబిజిగా ఉండడంతో ఆ యొక్క విషయాన్ని వారు చర్చించుకొని సేకరించడానికి వారం రోజులు పడుతుంది. కావున ఈ గడువును కూడా ఒక నెల రోజుల వరకు పెంచాలని, అదేవిధంగా శివారు ప్రాంతాలైన గ్రామపంచాయతీ కార్యాలయంలో, మున్సిపాలిటీ కార్యాలయంలో అభిప్రాయ సేకరణ తీసుకునే విధంగా నిర్ణయించాలని, అక్కడ నుండి చార్మినార్ ఖైరతాబాద్ ఇక్కడ కార్యాలయం వద్దకు వచ్చి అభిప్రాయాలు తెలియజేయాలి అని చెప్పడం సరికాదని అన్నారు..



# దశల వారీగా అభివృద్ధి చేస్తాం..

* **డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీపై దృష్టిపెడతానని**
* **హామీ ఇచ్చిన స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి..**


ఎల్బీనగర్, డిసెంబర్ 11 (భారత శక్తి): బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి కాలనీలో 35 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్ల పనులను డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో త్వరలోనే దశలవారీగా ఒకటొకటిగా ప్రతి అభివృద్ధి, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, సీనియర్ నాయకులు చిన్న యాదవ్, రంగారెడ్డి కాలనీ అధ్యక్షులు బొమ్మిడి రంగారెడ్డి, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ భువనేశ్వరి, తిరుమల రావు, రాజేష్ రెడ్డి, రమేష్ రెడ్డి, బాలరాజు, మల్లికార్జున్, కోటేశ్వరరావు, శరత్, రఘుపతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

# తార్నాక రహదారుల అభివృద్ధికి డిప్యూటీ మేయర్ ప్రత్యేక పర్యటన..



హైదరాబాద్, డిసెంబర్ 11(భారత శక్తి): తార్నాకలో రోడ్ల విస్తరణ, మరమ్మతులు కీలక సమస్యగా నిలుస్తున్న నేపథ్యంలో, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి గురువారం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి స్ట్రీట్ నెంబర్ వన్ లైన్ ప్రాంతంలో నూతన రోడ్డు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశీలన సందర్భంగా అధికారులతో మాట్లాడిన ఆమె, తార్నాక డివిజన్లో రహదారుల దయనీయ పరిస్థితిని వివరించి, తాత్కాలికం కాకుండా శాశ్వత స్థాయిలో నాణ్యమైన రోడ్లను రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని ఆదేశించారు.స్థానికులతో మాట్లాడిన డిప్యూటీ మేయర్, తార్నాక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి జిహెచ్ఎంసి బడ్జెట్ నుండి అవసరమైన రహదారి పనులు ఆమోదించేందుకు కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు..

# మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లపై ఉప్పల్ స్టేడియంలో డిజిపి సమీక్ష






హైదరాబాద్, డిసెంబర్ 11(భారత శక్తి): ఈనెల 13న ఫుట్ బాల్ క్రీడాకారుడు మెస్సితో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన భద్రతాపరమైన, ఇతర ఏర్పాట్లపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి, రాచకొండ సిపి సుధీర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మ్యాచ్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ, జలమండలి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు చెందిన అధికారులతో పాటు మ్యాచ్ నిర్వాహకులు కూడా ఈ సమావేశంలో హాజరై, తమ శాఖల ద్వారా జరుగుతున్న ఏర్పాట్లను డిజిపికి వివరించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ, మ్యాచ్‌కు తరలివచ్చే ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, వారికి సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, ఫుట్‌బాల్ ప్రొఫెషనల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సికి ఉన్న ప్రపంచవ్యాప్త ఇమేజ్ దృష్ట్యా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటున్నందున భద్రతాపరమైన ఏర్పాట్లు అత్యంత పటిష్టంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రేక్షకులకు సంబంధించిన మార్గదర్శకాలను, భద్రతా నియమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇందుకోసం మెట్రో రైళ్లలోనూ, నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే ప్రచార బోర్డుల ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ట్రాఫిక్ మళ్లింపు వివరాలను తెలియజేయాలని డిజిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా, అధికారులు ఉప్పల్ స్టేడియం భద్రతాపరమైన అనుకూలతలను డిజిపికి వివరించారు. 23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని, సెక్యూరిటీ పరంగా చాలా అనువైనదని వారు తెలిపారు. స్టేడియాన్ని సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్ అనే నాలుగు ప్రధాన సెక్టర్లుగా విభజించడం జరిగిందని, దాదాపు 39 వేల మంది కూర్చునే సామర్థ్యం ఈ ప్రాంగణానికి ఉందని వివరించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ మ్యాచ్‌ను ఎటువంటి లోపాలు లేకుండా, విజయవంతంగా నిర్వహించాలని డిజిపి అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో శాంతిభద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, డిజి, ఎస్పీఎఫ్ స్వాతి లక్రా, అడిషనల్ డిజిపి (సీఐడీ) చారు సిన్హా, అడిషనల్ డీజీపీ (ఇంటెలిజెన్స్) విజయకుమార్, డిజి, ఫైర్ సర్వీసెస్ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ శ్రీమతి పద్మజ,తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే స్వగ్రామంలో కాంగ్రెస్ ఓటమి

* **వీర్లపల్లిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రభావం...**
* **సర్పంచ్‌గా చిందం పాండు ఘన విజయం**

షాద్ నగర్, డిసెంబర్ 11 (భారత శక్తి): వీర్లపల్లి గ్రామంలో స్థానిక రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగ్రామం అయిన వీర్లపల్లిలో కాంగ్రెస్ శక్తివంతంగా బలపరిచిన అభ్యర్థి శేఖర్ గౌడ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అనుచరుడు చిందం పాండు 130 ఓట్ల విశేష మెజార్టీతో సర్పంచ్‌గా ఘనవిజయం సాధించారు.ఈ ఫలితంతో గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రభావం ఎంత దృఢంగా ఉందో మరోసారి బయటపడింది. కాంగ్రెస్ పార్టీ శక్తిగా ప్రచారం చేసినా, ఎమ్మెల్యే శంకర్ స్వగ్రామంలోనే ఓటర్ల మద్దతు దక్కకపోవడం పార్టీ నాయకత్వానికి పెద్ద దెబ్బగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గ్రామంలో చిందం పాండు విజయం ప్రకటించగానే ఆయన అనుచరులు భారీగా సంబరాలు జరుపుకున్నారు. వీర్లపల్లి ప్రజలు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నారని, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని నూతన సర్పంచ్ చిందం పాండు తెలిపారు. కాంగ్రెస్ శ్రేణుల్లో ఆత్మవిమర్శ తప్పనిసరి అయ్యిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.



**మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ లోని ఎలివేట్ ఫ్యూషన్ కిక్ బాక్సింగ్ అకాడమీ స్టూడెంట్స్ ఇయాకో నేషనల్ ఛాంపియన్స్ - 2025 ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ లో నిర్వహించిన పోటీలలో పతకాలు సాధించిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ రెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నిర్వాహకులు శివకుమార్, గిరి ముదిరాజ్, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.**

బడంగ్ పేట్, డిసెంబర్ 11(భారత శక్తి ):

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్... ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చ!

ఢిల్లీ, డిసెంబర్ 11(భారత శక్తి): భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయనడానికి సూచికగా, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాల పురోగతితో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొనసాగించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "అధ్యక్షుడు ట్రంప్‌తో చాలా ఆత్మీయంగా, ఫలవంతంగా సంభాషణ జరిగింది. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించాం. ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేయడం కొనసాగిస్తాయి" అని పేర్కొన్నారు. 'భారత్‌అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం'లో పురోగతిని నేతలిద్దరూ సమీక్షించారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారం నిలకడగా బలపడుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఇండియా-యూఎస్ కాంపాక్ట్' (COMPACT) అమలులో భాగంగా కీలకమైన సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి ప్రాధాన్యతా రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు. ఇదిలా ఉండగా, గత నెలలో ట్రంప్ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీని "గొప్ప వ్యక్తి", "నా స్నేహితుడు" అని అభివర్ణిస్తూ, త్వరలోనే భారత్‌లో పర్యటించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. నవంబర్ 6న వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "మోదీ నా స్నేహితుడు, మేం మాట్లాడుకుంటాం. నన్ను అక్కడికి రమ్మని కోరుతున్నారు. నేను వెళతాను" అని అన్నారు. 2020లో తన భారత పర్యటన అద్భుతంగా జరిగిందని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలు చాలా సానుకూలంగా సాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ పట్ల ట్రంప్‌కు గొప్ప గౌరవం ఉందని, ఇరువురు నేతలు తరచుగా మాట్లాడుకుంటారని ఆమె తెలిపారు. వాణిజ్య అంశంపై భారత ప్రతినిధులతో తమ బృందం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోందని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా జరిగిన ఫోన్ సంభాషణ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

## స్థానిక భక్తులకు ఈడిప్ విధానంలో వైకుంఠ ద్వార దర్శనం... టీటీడీ ప్రకటన

తిరుమల, డిసెంబర్ 11(భారత శక్తి): తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎదురుచూస్తున్న తిరుపతి, తిరుమల స్థానిక భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుభవార్త చెప్పింది. స్థానికుల కోసం ప్రత్యేక కోటా కింద ఈడిప్ (ఎలక్ట్రానిక్ డిప్) విధానంలో దర్శన టోకెన్లను జారీ చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6, 7, 8 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనం కోసం రోజుకు 5,000 చొప్పున టోకెన్లు కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ టోకెన్ల కోసం డిసెంబర్ 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి డిసెంబర్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ చేసుకున్న భక్తులకు డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు లాటరీ పద్ధతిలో టోకెన్లను కేటాయిస్తారు. కేటాయించిన 5,000 టోకెన్లలో తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల స్థానికులకు 4,500, తిరుమలలో నివసించే స్థానిక భక్తులకు 500 టోకెన్లు రిజర్వ్ చేశారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ ద్వారా 1+3 విధానంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని స్థానిక భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ కోరింది.

## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

**: సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 11(భారత శక్తి): ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు. 'మెస్సీ గోట్ ఇండియా టూర్'లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు కూడా రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## శీతాకాల విడిది కోసం
## హైదరాబాద్ వస్తున్న రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్, డిసెంబర్ 11(భారత శక్తి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లో ఐదు రోజుల పర్యటనకు రానున్నారు. తన వార్షిక శీతాకాల విడిదిలో భాగంగా డిసెంబర్ 17 నుంచి 21 వరకు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేయనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పటిష్ఠమైన భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ టెండర్లు, ప్రత్యేక వైద్య బృందాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖల సమన్వయంతో రోడ్లకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో 24 గంటలూ పాములు పట్టే బృందాన్ని సిద్ధంగా ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు. కోతుల బెడదను, తేనెటీగల సమస్యను నివారించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు వికాస్ రాజ్, సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఏటా శీతాకాలంలో రాష్ట్రపతి హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేసి, ఇక్కడి నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది.

## రేపు విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పర్యటన

అమరావతి, డిసెంబర్ 11(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విశాఖపట్నం ఐటీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. నగరాభివృద్ధిలో కీలక మైలురాళ్లుగా నిలిచే రెండు భారీ ప్రాజెక్టులకు రేపు (డిసెంబరు 12) శ్రీకారం చుట్టనున్నారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్‌తో పాటు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ తమ క్యాంపస్‌ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా విశాఖలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు రానుండగా, ప్రత్యక్షంగా 33 వేలకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాల్లో నిర్మించనున్న కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు. ఈ సంస్థ రూ.1,583 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఈ క్యాంపస్‌ను నిర్మించనుంది. దీని ద్వారా 8 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2029 నాటికి పూర్తి చేసి 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో, రుషికొండలోని మహతి ఫిన్ టెక్ భవనంలో వెయ్యి సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై దృష్టి సారిస్తుంది. మరోవైపు, దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ విశాఖ మధురవాడలోని హిల్ 4లో నిర్మించనున్న 'సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్'కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ క్యాంపస్‌లో కేవలం ఐటీ కార్యాలయాలే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో నివాసాలు, రిటైల్, హాస్పిటాలిటీ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో భారీ ప్రాజెక్టులు నిర్మించిన సత్వా గ్రూప్, విశాఖలో రాబోయే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖపట్నం త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ తో పాటు విశాఖపట్నంలో మరో 7 ఐటీ సంస్థల క్యాంపస్ ల నిర్మాణాలకు కూడా నారా లోకేశ్ రేపు భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు.

1. టెక్ తమ్మిన (Tech Tammina (Sree Tammina Software Solutions Pvt. Ltd)
విశాఖ మధురవాడలోని ఎస్పీవెల్ 4, హిల్ నెం2లో ఏర్పాటుకానున్న టెక్ తమ్మిన సంస్థ రూ.62కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 500 మందిగి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం అమెరికాలో ఉంది. నెదర్లాండ్స్, దుబాయ్, ఇండియాలో తన సేవలను అందిస్తోంది.
2. నాన్ రెల్ టెక్నాలజీస్ (Nonrel Technologies Private Limited)
విశాఖ నాన్ ఐటీ సెజ్, హిల్ నెం 2లో ఏర్పాటుకానున్న నాన్ రెల్ టెక్నాలజీస్ సంస్థ రూ.50.60 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 567 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
3. ఏసీఎన్ ఇన్ఫోటెక్ (ACN HealthCare RCM Services Pvt Ltd)
విశాఖ ఐటీ సెజ్ హిల్ నెం2లో ఏర్పాటుకానున్న ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్ సీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.30 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ 12 నెలల్లో తన వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది.
4. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (Imaginnovate Techsolutions (India) Pvt Ltd)
విశాఖ భీమిలిలోని కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ రూ.140కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2,600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
5. ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ (Fluentgrid Limited)
విశాఖ భీమిలి మండలం కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
6. మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (Motherson Technology Services Limited)
విశాఖపట్నం కాపులుప్పాడ ఫేజ్ 1 ఐటీ పార్క్ లో ఏర్పాటుకానున్న మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ రూ.109.73 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 1,775 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
7. క్వార్క్స టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (Quarks Technosoft Pvt Ltd)
విశాఖ కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న క్వార్క్స టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.115 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## ఇస్రో దూకుడు... డిసెంబర్ 15న
## అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం

అమెరికా, డిసెంబర్ 11(భారత శక్తి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల్లో మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. అమెరికాకు చెందిన 6.5 టన్నుల బరువున్న 'బ్లూబర్డ్ 6' కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని డిసెంబర్ 15న నింగిలోకి పంపనుంది. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్ 3 (LVM3) రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్న అత్యంత బరువైన ఉపగ్రహాలలో ఇది ఒకటి. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం కోసం అక్టోబర్ 19నే ఈ ఉపగ్రహం అమెరికా నుంచి భారత్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఇది కక్ష్యలో అతిపెద్ద కమర్షియల్ ఫేజ్డ్ అర్రేను కలిగి ఉంటుందని, గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా 10 రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేస్తుందని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (NSIL) ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. అంతరిక్ష రంగంలో భారత్, అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద సహకారం. గత జూలైలో ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1.5 బిలియన్ డాలర్ల నిసార్ (NISAR) ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. LVM3 రాకెట్ 8,000 కిలోల బరువును లోఎర్త్ ఆర్బిట్‌లోకి, 4,000 కిలోల బరువును జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి మోసుకెళ్లగలదు. ఇటీవలే నవంబర్ 2న 4.4 టన్నుల బరువున్న సీఎంఎస్ 3 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారానే విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.


## తెలంగాణ తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు...
## జగిత్యాలలో తల్లిపై కూతురు విజయం

హైదరాబాద్, డిసెంబర్ 11(భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సాయంత్రానికి వెలువడిన ఫలితాల సరళిని పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లి, కుమార్తె మధ్య పోటీ నెలకొంది. రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించడంతో శివరాత్రి గంగవ్వను బీఆర్ఎస్ బలపరచగా, ఆమె కుమార్తె సుమలతను కాంగ్రెస్ బలపరిచింది. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపులో తల్లి గంగవ్వపై కుమార్తె సుమలత 91 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొదటి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగగా, ఏకగ్రీవాలతో కలుపుకుని 776 మందికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 312 మంది, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు 63 మంది, ఇతరులు బలపరిచిన 164 మంది అభ్యర్థులు విజయం సాధించారు. మొదటి విడతలో 3,834



సర్పంచ్ పదవులకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డులకు 65,455 మంది పోటీ పడ్డారు. యాదాద్రి జిల్లా లక్ష్మక్కపల్లిలో సర్పంచ్ అభ్యర్థులకు ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. లాటరీ తీయడంతో డ్రాలో బీఆర్ఎస్ మద్దతుదారు ఇండ్ల రాజయ్య విజయం సాధించారు.

## హైదరాబాద్‌లో ఒకేచోట నాలుగు కార్లు దగ్ధం



హైదరాబాద్, డిసెంబర్ 11(భారత శక్తి): హైదరాబాద్ నగరంలో ఒకే చోట నాలుగు కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహ్మత్ నగర్ డివిజన్, ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నాలుగు కార్లు పూర్తిగా దగ్ధం కాగా, మరో కారు, ఒక ట్రాలీ ఆటో పాక్షికంగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సమీపంలోని నివాసాల వారు ఈ మైదానంలో కార్లను పార్కింగ్ చేస్తుంటారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదవశాత్తు జరిగిందా, లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో పోలీసుల విచారణ జరుపుతున్నారు. ఎస్ఆర్ నగర్ ఏసీపీ, బోరబండ ఏసీపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# పలు సవాళ్లతో కూడుకున్న కార్మికుల జీవితాలు..

- రోజు రోజుకు దిగజారుతున్న జీ.హెచ్.ఎం.సి. పారిశుధ్య కార్మికుల పరిస్థితులు..
- వారి పరిరక్షణకు కనీస ఉపకరణాలు కూడా లేకపోవడం దురదృష్టం..
- అనారోగ్య పరిస్థితులు నెలకొని ఉన్నా విధుల్లో మాత్రం ముందుంటారు..
- ప్రతి క్షణం ప్రమాదంతో సహవాసం చేస్తుంటారు..
- చాలీ చాలని జీతాలు.. గ్యారెంటీ లేని ఉద్యోగాలు..
- ఇలాంటి కార్మికులను సైతం దోచుకుంటున్న దుర్మార్గం..
- నెల నెలా తమ సూపర్ వైసర్ కు మామూళ్లు కట్టాల్సిందే..
- కార్మికులపాలిట రాక్షసుల్లా మారుతున్న ఎస్.ఎఫ్.ఏ. లు..
- ఎస్.ఎఫ్.ఏ. లు తలుచుకుంటే కార్మికుల పరిస్థితి మారిపోతుంది..
- తమకు అనుకూలంగా వున్నవారిని ఓ రకంగా చూస్తారు..
- అనుకూలంగా లేని వారికి ప్రత్యక్ష నరకం చూపిస్తారు..
- ఈ కార్మికుల్లో ఎవరైనా అందమైన ఆడవాళ్ళుంటే వారి పరిస్థితి మరింత అగమ్యగోచరం..
- చెత్త బండి వచ్చింది అంటాం.. మన ఆరోగ్యాలను కాపాడే కదిలే ఆసుపత్రి అని తెలుసుకోండి..
- జీ.హెచ్.ఎం.సి. పారిశుధ్య కార్మికుల జీవితాలపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, డిసెంబర్ 11 ( భారత శక్తి ) :** పనివేళలు, ప్రమాదాలు, భారీ వర్షాలు, పేరుకుపోతున్న చెత్త, నీటి నిల్వలు వంటి పరిస్థితుల్లో, చెత్త సేకరణ, డ్రైన్లు క్లీనింగ్ చేయడం వంటి పనులు జీ.హెచ్.ఎం.సి. కార్మికులు చేయాలి. వారు తమ పని సురక్షితంగా చేయటానికి కనిష్ట ఉపకరణాలు అంటే గ్లోవ్స్, బూట్లు, మాస్కులు, హెల్మెట్, యూనిఫామ్ లాంటి పీపీఈ కిట్లు లేకుండా పని చేస్తున్నారు. ఇది వాస్తవం..

ఒక ప్రత్యక్ష ఉదాహరణగా 2024 మాన్సూన్ ముందు, ఒక కార్మికుడు "సేఫ్టీ గేర్" లేకపోవడంతో, చెత్త మురికి నీటిలో పనిలో ఉన్నప్పుడు వస్తువుల వల్ల అనారోగ్య, స్కిన్ / శ్వాస సంబంధమైన సమస్యలు ఎదురై పెను ఆరోగ్య ప్రమాదానికి గురి అయ్యాయని చెప్పడం జరిగింది..

2020లో కరోనా మహమ్మారి సమయంలో కూడా జీ.హెచ్.ఎం.సి.లో మొత్తం 24,000 పారిశుధ్య కార్మికులలో చాలా మంది కార్మికులకు సేఫ్టీ కిట్స్ అందలేదనే వార్తలు వచ్చాయి.




ఈ సమస్య మాత్రమే కాదు.. తరచుగా వారికి అందాల్సిన వేతనాల విషయంలో కూడా తీవ్రమైన సమస్యలు ఎదురవ్వడం చూస్తున్నాం.. కొన్ని సందర్భాల్లో కొత్త హాజరు విధానాలు, బయోమెట్రిక్ / ఫేసియల్ రికగ్నిషన్ వంటి సిస్టమ్స్ కారణంగా నెలల్లో రూ. 1,000 నుంచి రూ. 5,000 వరకు శాలరీలో కోతలు విధించారని కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.. అయితే దురదృష్టం ఏమిటంటే పూర్తిగా హాజరు ఉన్నాసరే వేతన కోతలు తప్పడం లేదంటూ మరికొంతమంది కార్మికులు వాపోతున్నారు.. దీనికి కారణాలు అనేకానేకం ఉన్నాయి..

**ఉద్యోగ భద్రత, ఆర్థిక పరిస్థితులు :**

జీ.హెచ్.ఎం.సి.లో ఈ మధ్య కాలంలో సరికొత్తగా సుమారు 1,578 మంది కొత్త పారిశుధ్య కార్మికుల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.. అయితే, ఈ నియామకం "అవుట్ సోర్సింగ్ అంటే కాంట్రాక్టు బేసిస్ ఆధారంగా" చేసినట్లు ఉంది; వేతనం ప్రతినెల రూ. 15,600 అని నిర్ణయించారని వార్తలు వచ్చాయి..

ఈ అవుట్ సోర్సింగ్ పద్దతిలో నియామకాలు జరిపితే.. వారికి ఉద్యోగ భద్రత, వేతన స్థిరత్వం, ఇతర సౌకర్యాల విషయంలో అస్థిరంగా ఉండే అవకాశం ఉంటుంది. అనేక మంది కార్మికులు వేతనాల చెల్లింపులపై ఫిర్యాదులు చేస్తున్నట్లు గతంలో వార్తలు వెల్లడించాయి..

అలాగే బాగా ప్రామాణికంగా హాజరు సిస్టమ్ పెట్టినా, "పనివేళ్లు", "పని భారం", "పని గంటలు" వంటి వాటికి సంబంధించి పారదర్శకత లేకపోవడం, వేతన కోతలు, చెల్లింపులో ఆలాస్యం వంటి అంశాలు కార్మిక భద్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని తెలుస్తోంది.

*** సాంఘిక, ఆరోగ్య, మానవ హక్కుల సవాళ్లు :**

ఎవరైనా సరే "టార్చర్" అనే పదాన్ని ఉపయోగించడం అన్నిది కఠినమైన పని, అర్హ్వతల లేమి, సరైన భద్రత లేకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, దళిత లేదా వంచిత వర్గాల అపహాస్యం వంటి సంకల్పాలకు సంకేతం. ఈ రీతిలో కొందరు జీ.హెచ్.ఎం.సి. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్నారు:

*** ఆరోగ్య ప్రమాదాలు :**

మురికి నీటి స్థలాలు చెత్త ద్వారా వ్యక్తులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఎంతగానో ఉంటుంది.. చెత్త సేకరణ, డ్రెయిన్ క్లీనింగ్ సమయంలో సురక్షిత పరికరాలు లేకపోవడం వల్ల ఎన్నెన్నో దారుణాలు జరుగుతున్నాయి...

*** ఉద్యోగపు అస్తిరత్వం :**

వేతనాలలో కోతలు, వేతన చెల్లింపులో ఆలస్యం, సబ్‌కాంట్రాక్టు విధానం మొదలైనవి.. కార్మికులకు భరోసా లేకుండా చేస్తాయి.

*** సామాజిక అవమానాలు :**

పారిశుధ్య కార్మికులు ఉన్నత స్థాయి ఉద్యోగులు తక్కువ హక్కుల పరిరక్షణలతో పని చేస్తుండటం, అలాగే వారి విద్య, జీవన స్థాయి, సామాజిక మన్నింపు తక్కువగా ఉండటం. ఇది ఒక మౌన "టార్చర్" లాంటిది.

*** ప్రమాదకర సంఘటనలు :**

ఇటీవల గణేష్ నిమజ్జన సందర్భంగా ఒక



పారిశుధ్య కార్మికురాలు ఆమె రాంకీ ఎన్విరో ఇంజినీర్స్ తరపున పనిచేస్తున్న ఆమె.. ట్రక్ ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన జరిగింది. ఇది పారిశుధ్య పని కంటే ఎంత ప్రమాదకరంగా ఉండొచ్చో చెబుతోంది.

*** ప్రభుత్వం, జీ.హెచ్.ఎం.సి.బాధ్యత :**

*** అసలు వారు ఏమి చేయాలి..?**

*** స్థిరమైన ఉద్యోగాలు, వేతన భద్రత :**

పారిశుధ్య కార్మికులను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ద్వారా కాకుండా ఖచ్చితమైన స్థిర ఉద్యోగాలుగా నియమించి, వారి వేతనాలు, ప్రయోజనాలు, హక్కులను స్థాపించాలి. అవుట్ సోర్సింగ్ మద్దతు ఇవ్వడం వల్ల అస్తిరత్వం, వేతన కోతలు, దుర్వినియోగం ఎక్కువ అవుతుంది.

*** పూర్తిగానే సేఫ్టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పీపీఈ :**

క్యాంపులు, ఆరోగ్య శిబిరాలు, మాస్కులు, గౌన్లు, బూట్లు, గ్లోవ్స్, హెల్మెట్లు, యూనిఫామ్ లాంటి వసతులు నిరంతరంగా అందించాలి. ప్రతి సీజన్ ముందు, వరుసగా పంపిణీ చేయాలి. అలాగే, వ్యాధుల నిరోధక సిబ్బందిని అలాగే పోలీసులను నియమించాలి.

*** పారదర్శకత :**

పేమెంట్, కటింగ్స్, మామూళ్లు లాంటి వ్యవహారాలు నియంత్రించాలి.. వేతనాలు సమయానికి, పూర్తిగా ఇవ్వాలి; ఈ విధానాలపై పర్యవేక్షణ కఠినంగా ఉండాలి. కార్మికుల సామాజిక హక్కులు, గౌరవం కాపాడాలి.. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడం చేయగలగాలి.. మంచి నివాస సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, పిల్లలకి విద్య, వృద్ధాప్య భద్రత అంటే పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హక్కులు ఏర్పాటు చేయాలి. వారికి కావాల్సిన మానసిక గౌరవం, సమాజంలో అర్థమైనమైన స్థానం ఇవ్వాలి.

*** పారిశుధ్యం పనులకు సమగ్ర పోటీ సంస్థానాల మేనేజ్‌మెంట్ :**

వేస్ట్ కలెక్షన్, శానిటేషన్ లో ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ మాత్రమే కాకుండా, పర్మినెంట్ స్టాఫ్ ని నియమించదగిన నియంత్రణ, మానిటరింగ్ విధానాలు ఉండాలి. ఇది కార్మికుల హక్కులను, బాధ్యతలను సమానంగా నిలబెడుతుంది.

*** ప్రమాదాల బీమా / పరిహారం :**

ప్రమాదాలు జరిగినపుడు వెంటనే బీమా, పరిహారం, వైద్య సహాయం, కుటుంబులకు భరోసా ఇవ్వాలి. అలాగే మన సామాజిక బాధ్యత, కూడా ఖచ్చితంగా ఉండాలి.. వీరు చేసే పనిని అసహ్యంగా చూడకుండా వారు ఈ సమాజానికి, ఎంతో గొప్ప సేవ చేసే ప్రముఖులు అని వారిని గుర్తించాలి. వారిని గౌరవించాలి.. వారిపై దౌర్జన్యాన్ని ప్రదర్శించకూడదు..

మనం నివాసాలలో/సమాజంలో పారిశుధ్యాన్ని పాటించాలి.. చెత్తను రోడ్లపై, కాల్వల్లోకి వేయకుండా.. డంపింగ్ బకెట్స్, జీ.హెచ్.ఎం.సి. బిన్స్ ను వాడాలి. వారిపై మానవత్వంతో, గౌరవంతో, సహకారంతో ఉండాలి. కొంతమంది జీ.హెచ్.ఎం.సి. కార్మికులు గతంలో ఫిర్యాదులు చేసి వున్నారు.. ఆ ఫిర్యాదులను అధికారులు తక్షణమే పరిశీలించి వారికి తగిన న్యాయం చేయాలి.. కార్మికుల సమస్యలు కేవలం "పని భారం" మాత్రమే కాదు — వ్యవస్థాత్మక, సంస్థాత్మక, సామాజిక అంతరదృష్టుల దృష్టి కూడా అవసరం.

పారిశుధ్య కార్మికులు లేకపోతే.. మన నివాసాలు, వీధులు, పబ్లిక్ స్పేసెస్ స్వచ్ఛంగా ఉండవు. రోజువారీ చెత్త సేకరణ, డ్రెయిన్ క్లీనింగ్, పాళ్ల నుండి మురికి తొలగించడం.. ఇది నగరాన్ని జీవించదగిన ప్రదేశంగా మారుస్తుంది. కాబట్టి, వారికి సరైన గౌరవం, హక్కులు, భద్రత ఇవ్వడం.. మన సమాజం, మన ప్రభుత్వం, మన బాధ్యత.



## భగత్ సింగ్ నగర్ డివిజన్ గా మార్చాలి..

*** 70 శాతం జనాభా భగత్ సింగ్ నగర్ లోనే వుంటారు..**

*** డిమాండ్ చేసిన నరేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు..**

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి) : నూతనంగా ఏర్పడిన డాక్టర్స్ కాలనీ డివిజన్ ని భగత్ సింగ్ నగర్ డివిజన్ గా మార్చాలని డిమాండ్ చేశారు టి.ఆర్.ఎస్. సీనియర్ నాయకులు నరేష్ గౌడ్.. ఈ సందర్భంగా ఆయన మాజీ మంత్రి, బీ.ఆర్.ఎస్. ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని కలిసి ఈ ప్రక్రియకు చొరవ తీసుకోవాలని కోరడం జరిగింది.. విశేషం ఏమిటంటే డాక్టర్స్ కాలనీ పుట్టినప్పుడు, భగత్ సింగ్ నగర్ కూడా ఏర్పడిందని ఆయన తెలిపారు.. కాగా 70 శాతం మంది జనాభా ఓటర్స్ అంతా భగత్ సింగ్ నగర్ లో ఉంటారని తెలియజేశారు.. డాక్టర్స్ కాలనీ డివిజన్ ని భగత్ సింగ్ నగర్ డివిజన్ గా మార్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక నాయకులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నరేష్ గౌడ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు..

## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం..

# ప్రజల విశ్వాసానికి నిదర్శనం: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి) : రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్‌మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ



తరపున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం అని వ్యాఖ్యానించారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని.. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

## మంత్రి కొండా సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి) : రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తనపై మంత్రి సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువునష్టం కేసు వేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో విచారణకు హాజరుకాకపోవడంతో నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.